



విద్యుద్దీపవెలుగుల్లో బారాషహీద్ దర్గా ప్రాంగణం

'స్వర్ణాల' తీరాన

ఆధ్యాత్మిక పరవళ్లు

- అట్టహాసంగా రొట్టెల పండుగ ప్రారంభం
- తొలిరోజే తరలివచ్చిన భక్తజనం
- స్వర్ణాల చెరువులో రొట్టెల కోసం పోటీ
- దర్గా వద్ద చాంతాడంత క్యూలైన్లు
- నేటి అర్ధరాత్రి గంధమహోత్సవం

స్వర్ణాలతీరం భక్తజనంతో పరవళ్లు తొక్కింది. కోరికల రొట్టెను పట్టుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలి రావడంతో బారాషహీద్ దర్గా ప్రాంగణం కిక్కిరిసి పోయింది. యాత్రికులను తీసుకొచ్చిన వాహనాల రద్దీతో నెల్లూరు నగరం పులకించి పోయింది. రాష్ట్ర పండుగ అయిన రొట్టెల పండుగను ముస్లిం మత పెద్దలు సంప్రదాయ బద్ధంగా బుధవారం అట్టహాసంగా ప్రారంభించారు. తొలిరోజే లక్ష మందికిపైగా భక్తులు వచ్చి ఉంటారని అంచనా.

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 17 : కోరికల రొట్టెలను పట్టుకునేందుకు, తీరిన కోర్కెల రొట్టెల ఇచ్చేందుకు దూశం నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. 5రోజులపాటు జరిగే ఈ వేడుకల్లో బుధవారం తొలిరోజే అంచనాలకు మించి భక్తులు తరలివచ్చారు. బారాషహీద్ దర్గా, స్వర్ణాల చెరువు ఘాట్‌లు భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రాలుగా ఆకట్టుకుంటున్నాయి. క్యూలైన్లు నిండిపోవడంతో దర్శనానికి రెండు నుంచి మూడు గంటల సమయం పట్టింది. ఈ ఏడాది పండుగకు యువతీ యువకులు, నూతన జంటలు, చిన్నారులు పెద్ద ఎత్తున తరలిరావడం విశేషం. కల్యాణం, ఉద్యోగం, గృహం, ధన, ఆరోగ్యం, ఇతర రొట్టెలను ఇచ్చి పుచ్చుకుని ఆనందంగా తరలివెళుతున్నారు. మంచినీరు, వైద్యసేవలు, అన్నదానం, ఇతర సేవలు అందిస్తుండటంతో సింహపురీయుల ఆతిథ్యాన్ని చూసి యాత్రికులు ఉబ్బితబ్బిబ్బవుతున్నారు.

భక్తిశ్రద్ధలతో సందల్‌మాల్

పండుగలో తొలిఘట్టమైన సందల్‌మాలీ బుధవారం రాత్రి భక్తిశ్రద్ధలతో జరిగింది. మత పెద్దల ఆధ్వర్యంలో బారాషహీద్‌ల సమాధులను శుభ్రం చేసి గంధం ఎక్కించి కొత్త గలీఫ్‌లు కప్పి అలంకరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. గురువారం అర్ధరాత్రి జరిగే బారాషహీద్ గంధ మహోత్సవానికి కడప పీఠాధిపతి హజరత్ సయ్యద్ అరీఫుల్లా తదితరులు తరలిరానున్నారు. నగరంలోని కోటమిట్ట అమీనియా మసీదు నుంచి ఊరేగింపుగా గంధాన్ని దర్గా ప్రాంగణానికి తీసుకువస్తారు.

- తొలిరోజున జిల్లా న్యాయమూర్తి యామిని, ఇతర న్యాయమూర్తులు తరలివచ్చి బారాషహీదులను దర్శించుకున్నారు. జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్ దర్గాలో పర్యటించి భక్తులతో మాట్లాడారు.

కాగా అధికా రుల అంచనా ప్రకారం తొలిరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు లక్ష మందికిపైగా భక్తులు వచ్చి ఉంటారు. దర్గాలో భక్తుల కోసం నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ శర్మద, ఎస్‌ఈ సంపత్‌కుమార్, హెల్త్ ఆఫీసర్ రమణయ్య, సిటీ ప్లానర్ దేవకుమారి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అలాగే మైనార్టీ నాయకులు షంషుద్దీన్, సయ్యద్ సమీహుసేనీ, షబ్బీర్‌ఖాన్, ఉత్సవ కమిటీ చైర్మన్ షేక్.ఖాదర్‌బాషా, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

- దర్గాలో భక్తులకు అందుతున్న సేవలపై ఎస్పీ కృష్ణకాంత్ ఆరా తీశారు. భక్తుల సంఖ్య, పరిస్థితులపై పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎస్పీ అదనపు ఎస్పీలు సౌజన్య, శ్రీనివాసరావు, డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసరావు, రామకృష్ణఆచారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.





బారాషహీదుల దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తజనం







స్వర్ణాల చెరువులో భక్తుల కోలాహలం

భక్తిశ్రద్ధలతో మొహర్రం




మనుబోలు, జూలై 17 : జిల్లావ్యాప్తంగా బుధవారం మొహర్రం వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. పీర్లను ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు. పీర్ల చావిడి వద్ద ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో భక్తులు నడిచి తమ భక్తిని చాటుకున్నారు. మొహర్రం సందర్భంగా మనుబోలు మండలం కాగితాలపూరు గ్రామంలో దర్గాల వద్ద రక్తం చిందించే (మాతం)కార్యక్రమం నిర్వహించారు. షియా ముస్లిములంతా గ్రామానికి చేరుకుని కత్తులు, బ్లేడులతో రక్తం చిందిస్తూ ప్రార్థనలు చేశారు. పీర్లను ప్రత్యేకంగా అలంకరించి గ్రామంలో ఊరేగించారు. అంజుమన్ హుస్సేన్ కమిటీ చైర్మన్ మీర్జా వజీర్‌అలీ, ఉపాధ్యక్షుడు సయ్యద్ ఫజల్‌అలీ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎలాంటి అల్లర్లు, వివాదాలు జరగకుండా ఎస్‌ఐ. అజయ్‌కుమార్ బందోబస్తు నిర్వహించారు.

కుష్ఠు వ్యాధిపై
నేటి నుంచి సర్వే

ఇంటింటా తిరగనున్న ఏఎన్‌ఎంలు, ఆశాలు

కొత్త కేసులు గుర్తించిన వారికి వైద్యసేవలు



నెల్లూరు (వైద్యం), జూలై 17 : కుష్ఠు వ్యాధిపై ప్రత్యేక సర్వే చేసేందుకు కేంద్ర కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ ఆదేశాలు జారీ చేసింది. దీంతో వైద్య ఆరోగ్య శాఖ గురువారం నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు జిల్లాలో సర్వే చేపట్టనుంది. ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు ఇంటింటా తిరిగి వ్యాధిగ్రస్థులను గుర్తించనున్నారు. ఒంటిపై రెండుకు మించి మచ్చలు ఉన్నట్లయితే దాన్ని కుష్ఠు వ్యాధిగా అనుమానించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పూర్తిస్థాయి పరీక్షలు చేయించనున్నారు. ఈ సర్వే వివరాలను ఎప్పటి కప్పుడు సేకరించేందుకు అధికారులను నియమించారు. ఇప్పటివరకు జిల్లాలో 1034 మంది కుష్ఠువ్యాధిగ్రస్థులు ఉన్నారు. కుష్ఠువ్యాధి అం టువ్యాధి కాదని, దీనిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్య నిపుణులు చెబుతున్నారు.

పింఛను పెంపుతో ఊరట

టీడీపీ అధినేత నారా చంద్ర బాబునాయుడు సీఎంగా బాధ్యతలు చేపట్టాకు కుష్ఠు వ్యాధిగ్రస్థులకు ఇచ్చే పింఛను నగదు రూ. 3వేల నుంచి 6వేలకు పెంచారు. జిల్లాలో మొత్తం 490 మంది కుష్ఠువ్యాధిగ్రస్థులలో దివ్యాంగులు ఉన్నట్లు అధికారులు నిర్ధారించి ఈ పింఛను అందిస్తున్నారు. అలాగే వాకర్లు, ఊతకర్రలు కూడా సరఫరా చేస్తున్నారు. మరోవైపు కుష్ఠువ్యాధిగ్రస్థులలో శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి కూడా శస్త్రచికిత్సలు చేస్తున్నారు. ఈ శస్త్రచికిత్సలు చేయించుకున్న వారికి ప్రభుత్వ ప్రోత్సాహం కింద రూ. 8వేలు అందిస్తోంది.

కుష్ఠువ్యాధి నియంత్రణకు చర్యలు

గురువారం నుంచి జరిగే కుష్ఠువ్యాధి సర్వేలో వ్యాధిగ్రస్థులను క్షుణ్ణంగా పరిశీలిస్తాము. గుర్తించిన వారికి పూర్తిస్థాయి వైద్యసేవలు అందిస్తాము. జిల్లావ్యాప్తంగా కుష్ఠువ్యాధి నియంత్రణకు చర్యలు తీసుకుంటు న్నాం. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మందులు కూడా అందుబాటులో ఉన్నాయి. వ్యాధి పూర్తిగా తగ్గే వరకు మందులను ఉచితంగా పంపిణీ చేస్తాము. అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేస్తాం.

- డాక్టర్ ఖాదర్‌వలి, కుష్ఠువ్యాధి నివారణ జిల్లా అధికారి

వైసీపీ నేతల
పరకాయ ప్రవేశం!?

జనసేనలో చేరడానికి మేయర్ దంపతుల యత్నాలు?

వైసీపీకి చెందిన ఓ నేత నేతృత్వంలో ప్రయత్నం

మలుపు తిరుగుతున్న ఫోర్జరీ సంతకాల వ్యవహారం

వైసీపీ నేతలు పరకాయ ప్రవేశ మంత్రం జపిస్తున్నారు. మంత్రం ఫలించి అన్నీ అనుకూలిస్తే ప్రభుత్వంలో భాగస్వామ్యులైన జనసేన, బీజేపీలలో చేరి మళ్లీ చక్రం తిప్పడానికి, తమ పదవులకు, ఆస్తులకు భంగం కలగకుండా, క్రిమినల్ కేసుల భయం లేకుండా ఎంచక్కా ఐదేళ్లు గడిపేందుకు ప్రయత్నాలు చేసుకొంటున్నారు. ఇలాంటి ప్రచారమే నెల్లూరు నగరంలో విస్తృతంగా నడుస్తోంది. నగర మేయర్ పొట్లూరి స్రవంతి దంపతులు జనసేన పార్టీలో చేరడానికి ప్రయత్నాలు చేసుకొంటున్నట్లు ప్రజల్లో విస్తృత చర్చ నడుస్తోంది. నగరంలో వైసీపీకి చెందిన ఓ నేత, మాజీ మంత్రి మేయర్ దంపతులను జనసేనలో చేర్చడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

నెల్లూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : నగర పాలక సంస్థలో కమిషనర్ ఫోర్జరీ సంతకాల బాగోతం పాఠకులకు తెలిసిందే. అక్యుపేషన్ సర్టిఫికెట్ (ఏసీ), మార్టిగేజ్ రిలీజ్ ఫైళ్లలో కమిషనర్ సంతకాలనే ఫోర్జరీ చేసి కోట్ల రూపాయలు దండుకున్నారని, కార్పొరేషన్ ఆదా యానికి కోట్లాది రూపాయలు గండి కొట్టారనే విషయం వెలుగుచూసింది. ఈ వ్యవహారంలో అప్పటి కమిషనర్ వికాస్‌మర్మత్ స్వయంగా ఈ నెల 5వ తేదీన ఎస్పీకి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. కార్పొరేషన్ ఉద్యోగులతోపాటు మేయర్ భర్త జయవర్ధన్ పేరును ఆ ఫిర్యాదు లో ప్రస్తావించారు. ఆ ఫిర్యాదును ఎస్పీ నగర డీఎస్పీకి బదలాయిం చారు. ఇవన్నీ జరిగి 12 రోజులు గడిచినా నేటికీ కేసులో పురోగతి లేదు. అంతేకాదు. ఎఫ్‌ఐఆర్ కూడా కట్టలేదు. ఇది ప్రజల్లో పలు అనుమా నాలను రేకెత్తిస్తోంది. ఫోర్జరీ సంతకాల కుంభకో ణాన్ని వెలుగులోకి తెచ్చిన న్యాయవాది కాకు మురళీరెడ్డి సైతం బుధవారం విలేకరుల సమావేశంలో కమిషనర్ ఫిర్యాదుపై ఎందుకు ఎఫ్‌ఐఆర్ చేయకపోవ డంపై అనుమానాలు వ్యక్తం చేశారు.

అధికార రక్షణ కోసం

అధికార రక్షణ కోసం మేయర్ దంపతులు జనసేనలో చేరేందుకు ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. నెల్లూరు నగరంలో ఓ వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి వీరికి అండగా నిలిచి, జనసేన గూటికి చేర్చే బాధ్యతను భుజాన వేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం మేయర్ భర్త, కార్పొరేషన్ ఉద్యోగులు చెన్నైలో వైసీపీ నేత వద్ద రక్షణ పొందుతున్నారనే ప్రచారం కూడా సాగుతోంది.

అదెలా సాధ్యం : జనసైనికులు

జనసేన గూటికి చేరాలనే వైసీపీ నాయకుల కదలికలను జనసైనికులు, టీడీపీ నాయకులు జాగ్రత్తగా గమనిస్తున్నారు. కొత్త వారిని పార్టీలోకి తీసుకునే విషయంలో పవన్ కల్యాణ్ చాలా క్లారిటీగా ఉన్నారని ఆ పార్టీ శ్రేణులు అంటున్నారు. సచ్చీలురిని మాత్రమే పార్టీలోకి చేర్చుకోవాలని, అది కూడా వారు ప్రస్తుతం ఉన్న పదవికి రాజీనామా చేసి రావాలని పవన్ చెబుతున్నారని ఆ కోణంలో అయితే మేయర్ దంపతులకు జనసేనలోకి ప్రవేశం దొరకదని జనసేన వర్గాలు అంటున్నాయి. అయితే రాజకీయాల్లో ఏదైనా సాధ్యమే అని రుజువు చేసే చాలా సంఘటనలు చూసిన ప్రజలు మాత్రం రాజకీయాల్లో ఏదైనా సాధ్యమనే నమ్ముతున్నారు.



గోవింద హరి గోవింద!

తెలుగువారి తొలి పండుగ తొలి ఏకాదశిని జిల్లావాసులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. బుధవారం ఉదయం నుంచే వైష్ణవ ఆలయాల్లో అభిషేకాలు, అర్చనలు జరిగాయి. ఇక ఉత్సవర్లకు ప్రత్యేక అలంకరణలు, ఊరేగింపులు నిర్వహించారు. నెల్లూరులోని రంగనాథస్వామి స్వర్ణగరుడుడిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు.

యాత్రికులారా... తస్మాత్ జాగ్రత్త !



- నదులు, బీచ్‌లు, నీటి వనరుల వద్ద అప్రమత్తం
- రొట్టెల పండుగ ఆనందాన్ని ఆస్వాదిద్దాం..
- భక్తి పారవశ్యంతో క్షేమంగా ఇంటికెళదాం. !

ఆత్మకూరు, జూలై 17 : నెల్లూరులోని బారాషహీద్ దర్గా వద్ద ప్రతిఏటా రొట్టెల పండుగ వైభవంగా జరుగుతుంది. ఈ క్రమంలో బుధవారం నుంచి యాత్రికుల ప్రారంభమైంది. ఐదు రోజులపాటు లక్షలాది మంది రానున్నారు. రొట్టెలు పట్టేందుకు కడప, బద్వేలు, హైదారాబాద్, తదితర దూర ప్రాంతాల నుంచి ఆత్మకూరు మీదుగా నెల్లూరుకు చేరుకుంటారు. మరికొందరు నియో జకవర్గంలోని ఏఎస్‌పేట దర్గాను సందర్శించు కొని పండుగకు వెళతారు. ఈ క్రమంలో భక్తులు మార్గమధ్యంలో ఉన్న నదులు, బీచ్‌లు, నీటి వనరుల వద్ద వాహనాలను ఆపుకొని విశ్రాంతి తీసుకుంటారు. ఆయా నీటి వనరుల వద్ద ఈతకొట్టేందుకు పలువురు సరదా పడుతుంటారు. సంగం ఆనకట్ట వద్ద, జొన్నవాడ వద్ద, నెల్లూరు పరిసర ప్రాంతాల్లో ఉన్న బీచ్‌ల వద్ద, స్వర్ణాల చెరువుల వద్ద జాగ్రత్తలు పాటిం చాల్సి ఉంది.లేకుంటే తీర్థయాత్ర విషాద యాత్రగా మారనున్నది.

● గత సంఘటనలు మరవద్దు...

గతంలో కర్ణాటక నుంచి 50 మంది రొట్టెల పండుగకు బయలదేరి సంగం ఆనకట్ట వద్ద సేదతీరే క్రమంలో ఈతకొట్టేం దుకు వెళ్లి ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. ఇలా ప్రతి ఏటా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. నదులు, చెరువుల్లో సేదతీరే క్రమంలో ప్రమాదాలు చోటు చేసుకోవ డంతో పాటు వాహనాల్లో మితిమీరిన వేగంతో వస్తుండడం తో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి.

మనసులోమాట



ఏడోసారి వచ్చా

నేను ఇక్కడకు రావ డం ఇది ఏడోవ సారి. వచ్చిన ప్రతి సారీ నాకు అవసర మైన రొట్టెను పట్టు కుని తీసుకెళ్లా. ఈసారి ధనరొట్టెను తీసుకుందా మని వచ్చా. నా కుటుంబ సభ్యులంతా ఈ పండుగను బాగా నమ్ముతారు. అందుకే ఏటా ఖచ్చితంగా ఇక్కడకు వస్తాము.

- రేణుకా, అన్నవరం



వివాహ రొట్టె కోసం వచ్చాం

వివాహ రొట్టె తీసుకుం దామని వచ్చాము. మా ప్రాంతంలో ఈ పండుగ అంటే చాలా ప్రసిద్ధి. దీనికోసం ఎదురు చూస్తుం టారు. గతేడాది ఇంటి రొట్టె తీసుకున్నాము. అంతా మంచే జరిగింది. ఇక్కడ చాలా బాగుంది. అందరికీ మంచి జరగాలి.

- అల్ఫియానాజ్, అఫ్రీన్‌భాను, నాగ్‌పూర్, మహారాష్ట్ర



విశ్వాసంతో పట్టుకుంటే..!

నా కుటుంబంతో కలిసి మూడవ సారి ఇక్కడకు వచ్చాను. ఏ రొట్టె అందుకుంటానో ఆ కోరిక ఖచ్చితంగా నెరవేరుతోంది. ఈసారి సంతానం రొట్టె తీసుకుందా మని వచ్చాము. అనుకున్నది జరగాలన్న విశ్వాసంతో రొట్టె పట్టుకుంటే అంతా మంచే జరుగుతుంది. లేకపోతే ఇంతమంది ఎందుకు వస్తారు.

- సోఫియాఖాన్ కుటుంబం, పాల్‌ఘట్, మధ్యప్రదేశ్

పొంచి వున్న ప్రమాదం

- పండుగకు దూరప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తులు నీటివనరుల వద్ద సేదతీరే క్రమంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. సంగం ఆనకట్ట వద్ద ఉన్న పెన్నానదిలో స్నానాలు చేసేందకు అనుకూలంగా ఉంటుంది. జిల్లాలో ఎక్కడా నీళ్ల లేకపోయినా ఇక్కడ జలకళ ఉంటుంది. ఈ క్రమంలో పెన్నానదిలో ఈతకొట్టేందుకు దిగిన ఎంతో మంది భక్తులు ప్రమాదకర సుడిగుండాల్లో పడి చనిపోతున్నారు. ఇదే పరిస్థితి సోమశిల జలాశయం వద్ద, జొన్నవాడ వద్ద ఉంది.
- నదులు, బావులు, కొలనుల్లో నీటి లోతును గమనించి ఈతకు దిగాలి. అలాగే పూడిక, నాచు గురించి తెలుసుకోవాలి.
- ప్రమాదవశాత్తూ నీటిలో మునిగిన వ్యక్తులను ఒడ్డుకు చేర్చి, నీరు తాగి ఉంటే బయటకు కక్కించాలి.
- ఊపిరితిత్తుల్లో నీరు చేరిందా, లేదా గమనించాలి.
- ఊపిరితిత్తుల్లో శ్వాస లేదంటే ఛాతిపై చేతితో రుద్దాలి. ఇలా చేయడం వల్ల ఊపిరితిత్తుల్లో నుంచి నీరు బయటకు వచ్చి శ్వాస మెరుగుపడుతుంది.
- ప్రమాదానికి గురైన వ్యక్తికి ప్రథమ చికిత్స చేస్తుండగానే 108కు ముందస్తు సమాచారం అందించాలి.
- దూర ప్రాంతాల నుంచి వాహనాల్లో వచ్చే భక్తులు రోడ్డు ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని ఎక్కడా పొరపాట్లు జరగకుండా నిదానంగా రావాలి.



- మద్యం, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి.
- వాహనాల్లో అమర్చిన టేపురికార్డు లౌడ్‌స్పీకర్లతో ఇతర వాహనాల హారన్లు వినపడవు. దీని వల్ల కూడా ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. వీలైనంత వరకు వాహనాల్లో టేపురికార్డులో పాటలు తక్కువ సౌండ్ పెట్టుకొని వినాలి.
- రొట్టెలు పట్టుకునేందుకు చెరువులోకి దిగేటప్పుడు పిల్లల విషయంలో పెద్దలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వీలైతే దగ్గరుండి పిల్లలను తీసుకెళ్లాలి. పిల్లలను ఒంటరిగా వదిలేయకూడదు.
- పోలీసుల సూచనలు, విధివిధానాలను తప్పక పాటించాలి.

ఆయన నిర్మించారని ఆపేశారు...!

- బోగోలులో ఆరోగ్య కేంద్రాన్ని పూర్తిచేయించిన టీడీపీ నేత బీద రవిచంద్ర
- రాజకీయ కక్షతోనే మూసివేత
- పునఃప్రారంభించాలని గ్రామస్థుల డిమాండ్



బీద రవిచంద్ర నిర్మించిన వైద్య కేంద్రం

బిట్రగుంట, జూలై 17 : బోగోలులో అసంపూర్తిగా ఉన్న ఆరోగ్య కేంద్రాన్ని టీడీపీ నేత బీద రవిచంద్ర సొంత నిధులతో పూర్తి చేయించారు. ఆ భవనానికి తన తల్లి బీద జయమ్మ పేరు పెట్టారు.దీంతో ప్రారంభించిన ఐదురోజులకే ఆ కేంద్రాన్ని వైసీపీ నేతలు మూసివేశారు.దాన్ని పునఃప్రారంభించాలని గ్రామస్థులు కోరుతున్నారు. బోగోలు గ్రామచావిడిలో ఉన్న ఖాళీస్థలంలో ప్రజలకు ఉపయోగపడేలా ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించాలని గ్రామస్థుల నిర్ణయం మేరకు సర్పంచు దొడ్ల రమణమ్మ, వార్డు సభ్యులు తీర్మానం చేశారు. కోవూరుపల్లి పీహెచ్‌సీ మూడు కిలోమీటర్ల దూరంలో ఉందని, అక్కడికి వెళ్లాలంటే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని 2015లో కలెక్టర్ జానకిని కలసి గ్రామస్థులు వినతిపత్రం అందచేశారు. కలెక్టరు సానుకూలంగా స్పందించగా గ్రామ టీడీపీ నేతలు దొడ్ల అంజయ్య యాదవ్, సూలమయ్య, మరికొంతమంది దాతల సాయంతో భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. ఆ తరువాత దాతలు కొందరు ముందుకు రాక అసంపూర్తిగా పనులు నిలిచి పోయాయి. గత టీడీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్సీగా ఉన్న బీద రవిచంద్ర నిర్మాణాన్ని పూర్తి చేయించి, తన తల్లి బీద జయమ్మ స్మారక వైద్యకేంద్రంగా మార్చి 2019 మార్చి 19వతేదీన ప్రారంభించారు. ఆ తరువాత వైసీపీ ప్రభుత్వం రావడంతో ఐదు రోజులకే ఆ కేంద్రాన్ని మూసేశారు. ప్రజాప్రయోజనాన్ని పక్కన పెట్టి కేవలం బీద రవిచంద్ర నిర్మించాడనే కక్షతో వైసీపీ నాయకులు ఆరోగ్య కేంద్రాన్ని మూత వేయించారని గ్రామస్థులు పేర్కొన్నారు. దాన్ని వారు గ్రంధాలయానికి, హోమియో వైద్యశాలకు కేటాయించారు. బోగోలువాసులకే కాకుండా చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఉపయోగపడేలా నిర్మించిన ఈ ఆరోగ్య కేంద్రాన్ని పునఃప్రారంభించాలని గ్రామస్థులు ఇటీవల కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డిని కోరారు. ఆయన సానుకూలంగా స్పందించారు.



ఎవరిని అడిగి ఇచ్చారు...?

అష్టకష్టాలు పడి సొంతనిధులు, అధికారులు, దాతల సహకారంతో నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఎవరిని అడిగి గ్రంథాలయానికి, హోమియో వైద్యశాలకు ఇచ్చారు. ప్రభుత్వం మారింది. ఎప్పుడూ తమ హవా సాగుతుందని అనుకోవడం మంచి పద్ధతి కాదు.

- మాజీ ఉపసర్పంచు దొడ్ల అంజయ్య యాదవ్



ప్రజలే గుణపాఠం చెబుతారు..

ప్రజలకు ఉపయోగపడే పనులను అడ్డుకునేవారు నాయకులే కాదు. అప్పుడు నోరు విప్పకపోయినా సమయం వచ్చినప్పుడు ప్రజలే సరైన గుణపాఠం చెబుతారు.

- యనమాల సూలమయ్య, బోగోలు చెరువు సాగు నీటి సంఘం మాజీ ఉపాధ్యక్షుడు

క్షుద్రపూజలతో భయపెడుతున్నాడు!

- మండిపడ్డ కోడూరుపాడు దళితులు



అంబేడ్కర్ విగ్రహానికి పాలభిషేకం చేస్తున్న దళితులు

నెల్లూరు రూరల్, జూలై 17 : నెల్లూరు రూరల్ మండలం కోడూరు పాడుకు చెందిన ఓ వ్యక్తి ఇళ్ల వద్ద క్షుద్రపూజలు చేయిస్తూ మమ్మల్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అదే గ్రామానికి చెందిన దళితులు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం స్థానిక దళితవాడకు చెందిన సతీష్, ప్రసాద్, సుకుమార్‌లు విలేకర్లతో మాటాడుతూ తమ కాలనీకి చెందిన ఓ వ్యక్తి గ్రామ ద్రోహిగా మారడని మండి పడ్డారు. మట్టి, ఇసుక ట్రాక్టర్ల వద్ద డబ్బులు వసూలు చేయిస్తున్నాడని, దానిని ప్రశ్నిస్తే ఇళ్ల వద్ద క్షుద్రపూజలు చేయిస్తున్నాడని వాపోయారు. తమ గ్రామంతో పాటు, నారాయణరెడ్డిపేటలోని పేదలకు ఇళ్ల స్థలాలు వచ్చేందుకు టీడీపీ నేత కోడూరు కమలాకర్ రెడ్డి ప్రయత్నిస్తుంటే దానిని అడ్డుకునే క్రమంలో కలెక్టర్‌కు తప్పుడు సమాచారం అందచేస్తున్నాడని తెలిపారు. గ్రామంలో బెదిరింపులకు తెగబడుతూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాడని, ఇతనిపై పోలీసులు విచారణ చేపట్టాలని కోరారు. తమ కుటుంబానికి పెన్నా పోరంబోకు భూములున్నాయంటూ తప్పుడు సమాచారం ఇస్తు అధికారులు, ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నాడని, ఈ విషయమై రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు గ్రామంలో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. తమను ఎన్ని ఇబ్బందులు పెట్టిన తామంతా టీడీపీతోనే ఉంటామన్నారు.



వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పుట్టినరోజు వేడుకలు బుధవారం వెంకటగిరిలో ఉత్సాహంగా జరిగాయి. కురుగొండ్ల ఇంట్లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యేకు కేకు తినిపిస్తున్న టీడీపీ నాయకుడు బొట్టా హజరత్‌నాయుడు

మిగులు పొగాకు ఎలా...?

- కొనుగోలు చేయాలని రైతుల వినతి



పొగాకు బేళ్ల నాణ్యతను పరిశీలిస్తున్న రైతు

కలిగిరి, జూలై 17: ఈ ఏడాది పంటకాలం పొగాకు రైతులకు కలిసి వచ్చింది. అంతర్జా తీయ మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌ను బట్టి గత ఏడాదితో పాటు, ఈ ఏడాది కూడా మంచి ధరలు లభించాయి. అయితే గతేడాది మంచి లాభాలను చవిచూసిన రైతులు ఈ ఏడాది బోర్డు అధికారులు అనుమతించిన దానికన్నా ఎక్కువ విస్తీర్ణంలో పొగాకు సాగుచేశారు. ఈ క్రమంలో ఈ ఏడాది కలిగిరి పొగాకు బోర్డు వేలం కేంద్రం పరిధిలో మొత్తం 1268 బ్యారన్లను రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోగా, 4.56 మిలియన్ కేజీల పొగాకు పంట ఉత్పత్తికి అధికారులు అనుమతిచ్చారు. అయితే అధిక విస్తీర్ణంలో పొగాకు సాగు చేయడం ద్వారా మొత్తం 7.8మిలియన్ కేజీల పొగాకు దిగుబడి అయినట్లు బోర్డు అధికారులు అంచనా వేశారు. అయితే అనుమతించిన మేర పొగాకు కొనుగోళ్లను ఈనెల మూడవతేదీతో ముగించారు. అయితే ఇంకనూ రైతులవద్ద 3.2మిలియన్ కేజీల పొగాకు మిగిలి ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. పొగాకు క్యూరింగ్ జరిగి ఇప్పటికే ఆరు నెలల పూర్తవుతున్నదని, ఇంకనూ ఇళ్లవద్ద పొగాకు ఉంచుకుంటే వాతావరణ మార్పులవల్ల నాణ్యత తగ్గి ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే తమ వద్ద మిగిలిన పొగాకును కొనుగోళ్ల చేయాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



నిల్వల విషయం ప్రభుత్వం దృష్టికి..

కలిగిరి వేలం కేంద్రం పరిధిలో రైతుల వద్ద మిగిలి ఉన్న పొగాకు నిల్వల విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు పోయాం. అలాగే బోర్డు అధికారులు కూడా కంపెనీ ప్రతినిధులతో ఈ విషయమై చర్చించారు. రైతులకు నష్టం వాటిల్లకుండా కొనుగోళ్ల ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నాం.

- రావూరి శ్రీకాంత్‌బాబు, పొగాకు రైతు సంఘ నాయకుడు, కొత్తూరు

సోమశిలలో 9.838 టీఎంసీల నీరు నిల్వ

అనంతసాగరం, జూలై 17: సోమశిల పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, బుధవారం నాటికి డ్యాంలో 9.838 టీంఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఎగువ నుంచి 55 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నామని వారు తెలిపారు.

గ్రామస్థులపై పిచ్చికుక్క దాడి

అల్లూరు, జూలై 17 : మండలంలోని గ్రద్దగుంట దళితవాడలో బుధవారం ఓ పిచ్చికుక్క ఓ గేదె, ఇద్దరు పిల్లలు, మరో వ్యక్తిపై దాడిచేసి గాయపరచింది. ఈ ఘటనతో స్థానికులు ఉలిక్కి పడ్డారు. గ్రామంలోకి వచ్చిన పిచ్చికుక్క ఒక్కసారిగా అక్కడున్న గేదెను కరిచి, పక్కనే ఆడుకుంటున్న ఇద్దరు పిల్లలను కరిచింది. దాన్ని తరిమేందుకు వెళ్లిన ఓ వ్యక్తిపై కూడా దాడిచేసి కరిచింది. దీంతో గ్రామస్థులు ఆ కుక్కను తరుముకోగా గ్రామం వదిలి వెళ్లిపోయింది. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు.

నేటి నుంచి మంత్రి ఆనం పర్యటన

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 17: రాష్ట్ర దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఈనెల 18, 19, 20వ తేదీలలో జిల్లాలో పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. గురువారం ఉదయం నగరంలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. సాయంత్రం 6గంటలకు బారాషహీద్ దర్గాలో జరుగుతున్న రొట్టెల పండుగలో పాల్గొని, దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. 19న రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరుక్, రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పీ.నారాయణతో కలిసి స్థానిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. సాయంత్రం బారాషహీద్ దర్గాను సందర్శిస్తారు. 20న ఉదయం 9గంటలకు సోమశిల జలాశయాన్ని సందర్శించి ఆప్రాన్ పనులను పరిశీలిస్తారు. అనంతరం విజయవాడ బయలుదేరి వెళతారని అధికారులు తెలిపారు.

కుక్కకాటుతో బాలుడికి గాయాలు

కోవూరు, జూలై 17: కుక్క కరవడంతో ఓ బాలుడికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని చెర్లోపాళెం గ్రామంలో బుధవారం జరిగింది. ఇంటి ముందు ఆడుకుంటున్న అభిలాష్ కుమారుడ్ని కుక్క కరవడంతో గాయాలు కాగా వెంటనే చికిత్స నిమిత్తం వైద్యశాలకు తీసుకువెళ్ళారు.

20న విశ్రాంత ఉద్యోగుల సమావేశం

నెల్లూరు(హరనాథపురం), జూలై 17: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా సర్వసభ్య సమావేశం ఈనెల 20వ తేదీ సాయంత్రం 5 గంటలకు నగరంలోని టౌన్‌హాల్లో జరుగుతుందని ఆ అసోసియేషన్ అధ్యక్షుడు ఐ.లక్ష్మీనారాయణ, కార్యదర్శి పీ.వెంకయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో విశ్రాంత ఉద్యోగుల సమస్యలను చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని తెలిపారు.

వరుస చోరీలతో బెంబేలెత్తుతున్న ప్రజలు



ఆలయంలో విచారిస్తున్న పోలీసులు

వరికుంటపాడు, జూలై 17: వరికుంటపాడు పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో మంగళవారం అర్ధరాత్రి సమయంలో వరుస చోరీలు జరగడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. గ్రామంలోని నాగార్పమ్మ ఆలయంలో హుండీని దొంగిలించిన దుండగులు కొంతదూరం తీసుకెళ్లి పగులకొట్టిన అనంతరం అందులోని నగదును తీసుకెళ్లి ఆ హుండీని అక్కడే పడేసి వెళ్లారు. అలాగే యాదగిరి మాల్యాద్రికి చెందిన మోటారుబైక్‌ను, మెట్టెం మాధవరావుకు చెందిన సెల్‌ఫోన్లను సైతం చోరీచేశారు. వీటితో పాటు మట్టెం కొండయ్య నివాసంలో రూ. 8వేలతో సహా సమీప ఆంద్రావారిపల్లికి చెందిన ఆంద్రా లక్ష్మిరెడ్డి నివాసంలో రూ. 20వేలు, ఆంద్రా బాలగురవారెడ్డి నివాసంలోనూ మరికొంత నగదును దోచుకెళ్లారు. కాగా, బుధవారం అటుగా వెళ్లిన ఆలయ ధర్మకర్త మితుకుళ్ల మాలకొండయ్య ఆలయంలోని హుండీ చోరీకి గురయినట్లు గమనించి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఆలయానికి చేరుకున్న పోలీసులు పరిసరాలను పరిశీలించి విచారణ చేపట్టారు. గ్రామాల్లో జరిగిన చోరీలపైనా ఆరా తీస్తున్నారు. ఒకే సమయంలో వరుస చోరీలు చోటుచేసుకోవడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. రాత్రి సమయాల్లో పోలీసులు గస్తీ నిర్వహించాలని కోరుతున్నారు.

ఉదయగిరిలో చోరీ

- నగదు, బంగారం అపహరణ

ఉదయగిరి రూరల్, జూలై 17: పట్టణంలోని అగ్రహారం వీధిలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకొంది. వివరాల మేరకు.. ఇంటికి తాళం వేసి యజమాని మహమ్మద్ రియాజ్ తన కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం మండలంలోని దాసరిపల్లి గ్రామంలో జరుగుతున్న మొహర్రం వేడుకలకు వెళ్లి తిరిగి బుధవారం సాయంత్రం ఇంటికి వచ్చారు. ఇంటి ప్రధాన ద్వారానికి వేసి ఉన్న తాళం ధ్వంసం చేసినట్లు గుర్తించారు. ఇంటి వెనుక వైపు ఉన్న తలుపులు తీసి ఉండడాన్ని గమనించి ఇంట్లోని బీరువాను పరిశీలించగా లాకర్‌లో ఉన్న రూ.20 వేల నగదు, ఒక జత బంగారు కమ్మలు, ఉంగరం చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈమేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	130
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	234
స్కిన్‌లెస్	260
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7113
వెండి కిలో ధర	రూ. 94,900
వెండి ఒక గ్రాము	రూ. 96.90

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

- 70 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం



బియ్యం లోడ్‌తో ప్రమాదానికి కారణమైన వ్యాను

మనుబోలు, జూలై 17: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలైన సంఘటన పొదలకూరు-మనుబోలు మార్గంలో మంగళవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని అక్కంపేటకు చెందిన హజారుద్దీన్‌కు మదనపల్లికి చెందిన నిండలి సురేష్ స్నేహితుడు. హజారుద్దీన్‌ను కలిసేందుకు సురేష్ వచ్చాడు. ఇద్దరూ మోటార్‌సైకిల్‌పై పొదలకూరుకు వెళ్లి పనులు ముగించుకుని అక్కంపేటకు వస్తుండగా కొండపాళెం క్రాస్‌రోడ్డు వద్ద రేషన్ బియ్యంతో గూడూరు మండలం మిట్టాత్మకూరు మార్గంలోంచి వ్యాను వస్తూ మలుపుతిప్పే క్రమంలో మోటార్‌సైకిల్‌ను ఢీకొంది. దీంతో సురేష్, హజారుద్దీన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరగగానే వ్యాను వదిలి డ్రైవర్ పరారయ్యాడు. చికిత్స నిమిత్తం ఇద్దరు యువకులను నెల్లూరుకు తరలించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ అజయ్‌కుమార్ సంఘటనా స్థలికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. ప్రమాదానికి కారణమైన వ్యానును స్థానిక స్టేషన్‌లో ఉంచారు. అందులో 70 బస్తాల రేషన్‌బియ్యం ఉన్నట్లు గుర్తించారు. ఈ వ్యానుకు నంబర్‌ప్లేటు సరిగా లేదు. బండిపై ఉన్న నంబర్ సగం మాత్రమే ఉండడంతో అక్రమ రవాణా అన్న అనుమానం వ్యక్తమవుతోంది. ఈ బియ్యాన్ని ఎక్కడి నుంచి ఎక్కడికి తరలిస్తున్నారన్నది దర్యాప్తులో తేలాల్సి ఉంది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రేపు పెన్షనర్ల సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 17 : ఆంధ్రప్రదేశ్ పెన్షనర్ల సంఘం జిల్లా సర్వ సభ్య సమావేశం ఈనెల 19వ తేదీ సాయంత్రం 4గంటలకు భక్తవత్సల నగర్‌లోని పెన్షన్ భవనంలో జరుగుతుందని ఆ సంఘం అధ్యక్షుడు ఎస్ఎం.గౌస్, ప్రధాన కార్యదర్శి ఎస్‌వీవీఎస్ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షనర్స్ వారి కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజల కోసం మెడికవర్ ఆసుపత్రి కార్డియాలజిస్టు ఎం.జయరామ్ ద్వారా గుండె సంబంధిత వ్యాధుల పరీక్షలు, అవగాహన కార్యక్రమం జరుగుతుంని పెన్షనర్స్ అందరూ తరలిరావాలని కోరారు.

క్వార్ట్జ్ అక్రమ నిల్వలపై విచారణ

సైదాపురం,జూలై 17: మండల పరిధిలోని కమ్మవారిపల్లి గ్రామం సమీపంలో అక్రమంగా ఉన్న క్వార్ట్జ్ నిల్వలపై మైనింగ్, రెవెన్యూ శాఖ అధికారులు బుధవారం అర్ధరాత్రి వరకు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా మైనింగ్ శాఖ డీడీ శ్రీనివాస్ మాట్లాడుతూ చీకటి పడడంతో పాటు వర్షం కూడా కురుస్తున్నందున పూర్తిస్థాయి విచారణ చేపట్టలేకపోయామన్నారు. గురువారం పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి వివరాలు వెల్లడిస్తామని ఆయన తెలిపారు.

ఆటోనగర్ ట్రంకురోడ్డుకు మోక్షం

కావలిటౌన్, జూలై 7: ఎట్టకేలకు ముసునూరు ఆటోనగర్ ట్రంకురోడ్డుకు మోక్షం లభించింది. ఐదేళ్లనుంచి ఏనోటా విన్నా ఈ రోడ్డు దుస్థితిపైనే చర్చ జరిగేది. ఎమ్మెల్యేగా కృష్ణారెడ్డి గెలిచిన 40రోజుల్లోనే తారురోడ్డు వేశారు. దీంతో ముసునూరు వాసులతోపాటు నెల్లూరు వెళ్లే ప్రజలు, వాహనచోదకులు హర్షం వక్తం చేస్తున్నారు. తుమ్మలపెంట రోడ్డుకి కూడా మోక్షం లభిస్తే బావుంటుందని వారంటున్నారు.



ఆటోనగర్ వద్ద రూపు దిద్దుకున్న తారురోడ్డు



సంగం: సారెతో ఊరేగింపుగా ఆలయానికి వస్తున్న భక్తులు



ఉదయగిరి శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు

ఆత్మకూరు, జూలై 17 : తొలి ఏకాదశిని బుధవారం ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని వేంకటేశ్వరస్వామి, అలఘునాథస్వామి ఆలయంతోపాటు వివిధ ఆలయాల్లో భక్తులు బారులుదీరి పూజలు నిర్వహించారు.

సంగం : స్థానిక రామచంద్రాపురంలోని కోదండరామాలయంలో ఏకాదశి సందర్భంగా బుధవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామలక్ష్మణ విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించి పూలతో అలంకరించారు.వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

● **కామాక్షిదేవికి సారె సమర్పణ**

సంగంలోని సంగమేశ్వరాలయంలో వెలసిన కామాక్షిదేవికి ఏకాదశిని సందర్భంగా సారె సమర్పణ చేశారు. ఈ సందర్భంగా మూలవిరాట్‌కు శా కాంబరీ అలంకారం చేశారు. మహిళలు ఇంటి వద్ద నుంచి సారె తీసుకుని స్థానిక పోలేరమ్మ గుడికి చేరుకున్నారు. అక్కడి నుంచి మేళతాళాలు, మంగళవాయిద్యాలు, తప్పెట్లతో ర్యాలీగా బయలుదేరి సారెతో గ్రామోత్సవంగా సంగమేశ్వరాలయానికి చేరుకుని మొక్కు తీర్చుకున్నారు.

ఉదయగిరి: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం మండలంలోని పలు గ్రామాల్లోని ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో పూజ లు నిర్వహించారు. మండలంలోని గన్నేపల్లి, గండిపాళెం, కృష్ణంపల్లి, కుర్రపల్లి, అప్పసముద్రం, జీ.చెరువుపల్లి, చెర్లోపల్లి, అయ్యవారిపల్లి, శకునాలపల్లి, కొత్త పల్లి, పుల్లాయపల్లి తదితర గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

వరికుంటపాడు: మండలంలోని పలు గ్రామాల్లో ఆలయాలు బుధవారం భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకొని పూజలు నిర్వహించారు. అర్చకులు తీర్థప్రసాదాలు అందచేశారు.

వింజమూరు : పట్టణంలోని తొలి ఏకాదశి పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అన్ని దేవాలయాల్లో భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఉదయగిరి రూరల్, జూలై 17: మండలంలోని గండిపాళెం గ్రామానికి చెందిన సూరిపోగు గురవయ్య అనారోగ్యంతో మృతిచెందడంతో కుటుంబ సభ్యులకు జీఎంకే ట్రస్టు చైర్మన్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుంటుపల్లి మాలకొండయ్య చౌదరి, ఐటీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రెడ్డిబత్తిన సాయిలు ఆర్థికసాయం అందజేశారు. వారు ఒక్కొక్కరు రూ.5 వేల చొప్పున తమ ప్రతినిధులచే కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు బీ వెంకటేశ్వర్లు, షేక్ ఇమ్రాన్, భాస్కర్, నవీన్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), జూలై 17: దుత్తలూరు మెయిన్ ఫీడర్‌లో మరమ్మతుల దృష్ట్యా గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ వెంకటసుబ్బయ్య బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కావున వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

నేటి నుంచి సర్వే

వరికుంటపాడు, జూలై 17: మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం నుంచి కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే నిర్వహించనున్నట్లు సీహెచ్‌వో రాజశేఖరరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ కుష్ఠు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 2వ తేదీ వరకు ఇంటింటికి వెళ్లి వ్యాధి సోకిన వ్యక్తులతో పాటు అనుమానిత లక్షణాలు ఉన్నవారిని గుర్తించి వారికి ప్రభుత్వ వైద్యశాలల్లోనే ఉచితంగా చికిత్స, మందులు అందజేయడం జరుగుతుందన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు



గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న బీజేపీ నాయకులు

ఏఎస్‌పేట, జూలై 17: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తామని బీజేపీ మండల అధ్యక్షుడు చెంచులరెడ్డి తెలిపారు.బుధవారం ఆయన గుడిపాడు ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు సిరిగిరి మహేష్‌రెడ్డి, నీలం వీరబ్రహ్మం, సురేష్ యాదవ్, సయ్యద్ మస్తాన్ పాల్గొన్నారు.

ఘనంగా మొహర్రం

ఉదయగిరి, జూలై 17: మండలంలో బుధవారం ముస్లింలు మొహర్రం వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పుల్లాయపల్లి, బిజ్జంపల్లి, గండిపాళెం, వెంగళరావునగర్, దాసరిపల్లి, ఉదయగిరి గుంతబజార్, నాగుల బావివీధి పీర్లచావిడిలు, అబ్దుల్‌ఖాదర్‌ఖాన్‌షావలి దర్గా, ఆస్థానంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మతపెద్దలు మొహర్రం విశిష్టతను వివరించారు.



ఉదయగిరి గుంతబజార్ పీర్లచావిడి వద్ద ప్రార్థన చేస్తున్న ముస్లింలు

వరికుంటపాడు: మండలంలోని తోటలచెరువుపల్లిలో బుధవారం మొహర్రం వేడుకలు నిర్వహించారు. తొలుత పెద్ద వెంకటయ్యానాయన ఉరఫ్ ఖాశీం చిష్టి ఇంటి నుంచి గంధం, ప్రసాదాలను మేళతాళాలతో దర్గాకు చేర్చి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం భక్తులకు పంచి పెట్టారు. అలాగే రాత్రికి అన్నదానంతో పాటు గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సంద ర్భంగా పీర్ల చావిడితో పాటు దర్గాను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు.



అనంతసాగరంలో ప్రత్యేకంగా అలంకరించిన పీర్లు

సంగం: మండలంలోని వంగల్లు పీర్ల చావిడిలో మంగళవారం అర్ధరాత్రి ముస్లింలు మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీర్లను అలంకరించి ట్రాక్టర్‌లో ఊరేగించారు. పీర్ల చావిడి వద్ద భక్తులు గుండం తొక్కారు.

అనంతసాగరం : మండలంలోని పలుగ్రామాల్లో మొహర్రంను ఘనంగా నిర్వహించారు. పీర్ల చావిడిలో పీర్లను ప్రతేకంగా అలంకరించి మంగళవారం తెల్లవారు జామున ఊరేగించారు. బుధవారం షహదత్ కార్యక్రమంతో వేడుకలు ముగుస్తాయి.

కలువాయిలో కురుగొండ్ల జన్మదిన వేడుకలు



కలువాయిలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

కలువాయి, జూలై 17 : వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ జన్మదిన వేడుకలను బుధవారం కలువాయిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేశారు. వృద్ధుల ఆశ్రమంలో బిర్యానీ పొట్లాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చల్లా రఘురామిరెడ్డి, గడ్డం కిషోర్‌రెడ్డి, చల్లా శ్రీనివాసులరెడ్డి, అల్లంపాటి వేణుగోపాల్ రెడ్డి, జగదల్ నాయుడు, చింతలాత్మకూరు సర్పంచి ప్రభావతి, హరినాయుడు, బీజేపీ నాయకులు దండు పెంచలయ్య, సుందరయ్య యాదవ్, నరసింహులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి : సీపీఎం



బిజ్జంపల్లిలో ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

ఉదయగిరి రూరల్, జూలై 17: మండలంలోని బిజ్జంపల్లి గ్రామంలో బుధవారం సమస్యలను పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో రైతులు, ప్రజలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ స్పందించి ఉదయగిరి-బండగానిపల్లి ఘాట్‌రోడ్డు నిర్మాణం వెంటనే పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్డు కోతకు గురై రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వ్యవసాయ రంగానికి ఉదయం 7, 8 గంటలకు మాత్రమే విద్యుత్ సర ఫరా చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కుర్రపల్లి గ్రామం వద్ద ఉన్న ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చి గ్రామాలకు శుద్ధిజలాలు సరఫరా చేయాలన్నారు. గ్రామాలకు పల్లెవెలుగు బస్సులు నడిపి ప్రజల ప్రయాణ కష్టాలు తీర్చాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు షేక్ నాయబ్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ప్రమాదకరంగా మలుపు

సాగరం చెరువుపై

ప్రమాద ఘంటికలు

అనంతసాగరం, జూలై 17: అనంతసాగరం చెరువు కట్టపై ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. కట్టపై రెండు మలుపులు ఉండగా, ఇప్పటికే అక్కడ లెక్కలేనన్ని ప్రమాదాలు జరిగాయి. ఒక వైపు చెరువు, మరోవైపు లోయతో పలువురు ప్రాణాలు కూడా కోల్పోయారు. అయినా ఆర్‌అండ్‌బీ, పోలీసు అధికారులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోలేదు. వేగ నియంత్రణ చర్యలు లేక వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

పచ్చదనం కరువయిన సోమశిల

అనంతసాగరం, జూలై 17: ఒకప్పుడు పచ్చదనంతో కళకళలాడిన సోమశిల జలాశయం నేడు పర్యవేక్షణ లోపం, సిబ్బంది కొరత కారణంగా కళ తప్పింది ప్రాజెక్టుపై ఎర్త్‌డ్యాకు ఇరువైపులా పూలమొక్కలు, మధ్యలో పచ్చిక పెంచడంతో డ్యాం సందర్శనకు వచ్చే పర్యాటకులు జలాశయం ప్రాంతం లో కాసేపు విశ్రాంతి తీసుకొని ఆహ్లాదం పొందేవారు. నేడు ఆపరిస్థితి లేదు. పరిసరాలన్నీ బోసిపోయాయి. పూలకుండీలు ఖాళీగా దర్శనం ఇస్తున్నాయి. మొక్కలకు నీరు పట్టక ఎండు ముఖం పట్టాయి. ఈక్రమంలో ప్రాజెక్టు అందాలు పర్యాటకులను నిరాశ పరుస్తున్నాయి.



ఎర్త్‌డ్యాం పై ఎండుముఖం పడుతున్న మొక్క



ఖాళీగా ఉన్న పూలకుండీలు

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

మొహర్రం వేడుకల్లో ఎమ్మెల్యే

కావలిటౌన్, జూలై 17: పట్టణంలో బుధవారం మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు. జెండా చెట్టు దర్గా పీర్ల చావిడి, విష్ణాలయం వీధిలోని పీర్ల చావిడి, ముసునూరు పీర్ల చావిడిల వద్ద పీర్లకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పీర్ల శుద్ధి నిర్వహించి, వేడుకలకు ముగింపు పలికారు. ఇస్లాంపేట సున్నీ మసీద్‌లో మత గురువు మొహర్రం ప్రాముఖ్యతను చాటి చెప్పారు. ఎమ్మెల్యే డీ కృష్ణారెడ్డి విష్ణాలయంవీధిలోని చావిడి వద్ద ప్రార్థనలు చేశారు. అనంతరం అన్నదానాన్ని ప్రారంభించారు.

అల్లూరు : పట్టణంలో బుధవారం సాయంత్రం పీర్లను నీటి కొలనుకు తరలించారు. మంగళవారం అర్ధరాత్రి నార్తుమోపూరు నుంచి పీరు అల్లూరుకు వచ్చింది. వేలాదిగా భక్తులు తరలివచ్చి మొక్కు తీర్చుకున్నారు. మౌలాలీ దర్గాలో పీరుకు ఫాతెహాను నిర్వహించారు.



కావలి : పీర్ల వద్ద ప్రార్థన చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి తదితరులు



అల్లూరు : మౌలాలీ పీరుకు ఫాతెహాను నిర్వహిస్తున్న ముస్లింలు

ఊరూరా భక్తిశ్రద్ధలతో తొలిఏకాదశి

కావలిటౌన్, జూలై 17: తొలిఏకాదశిని పురస్కరించుకుని బుధవారం పట్టణంలోని ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. కలుగోళశాంబవి ఆలయం, విష్ణాలయం, బృందావనం కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయం, పాతూరు శివాలయం, సత్యనారాయణస్వామి ఆలయం, వెంగళరావునగర్ ఆలయ సముదాయం, ముసునూరు హనుమత్ క్షేత్రాలకు భక్తులు పెద్దఎత్తున చేరుకుని పూజలు నిర్వహించారు. తొలిపండుగ తొలి ఏకాదశి కావటంతో భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. ఈ సందర్భంగా గీతా మందిరంలో సామూహిక లక్ష తులసి పూజ నిర్వహించారు.



కావలి గీతా మందిరంలో సామూహిక లక్ష తులసీపూజ నిర్వహిస్తున్న భక్తులు

కావలి రూరల్ : మండలంలోని గ్రామాల్లో ఉన్న రామాలయాల్లో బుధవారం తొలి ఏకాదశి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు ఆలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు. రామాలయాలను విద్యుత్ దీపాలు, పచ్చతోరణాలతో అలంకరించారు.

బిట్రగుంట : బోగోలు మండలంలో తొలి ఏకాదశి సందర్భంగా పలువ ఆలయాల్లో బుధవారం ప్రత్యేక పూజాభిషేకాలు జరిగాయి. ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో పాలక మండలి మాజీ చైర్మన్ శ్రీరాం మాల్యాద్రి -సుగుణమ్మ దంపతుల ఆధ్వర్యంలో భజనలు, ప్రవచన కార్యక్రమాలు జరిగాయి. స్వామి అమ్మవార్ల దర్శనానికి వచ్చిన భక్తులకు దేవస్థానం వారు అన్న సంతర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో రాధాకృష్ణ, అర్చకులు లక్ష్మీనరసింహాచార్యులు, కళ్యాణ చక్రవర్తి, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. బోగోలు, చెంచులక్ష్మీపురం, విశ్వనాథరావుపేట, కొత్తూరు గ్రామాల్లోని రామాలయాల్లో కూడా ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి.

నేటి నుంచి జనసేన సభ్యత్వ నమోదు

కలిగిరి, జూలై 17: జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు గురువారం నుంచి ప్రారంభమవుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బండారు లక్ష్మీనారాయణ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పార్టీ నాలుగో విడత సభ్యత్వ నమోదును గురువారం నుంచి ఈనెల 28వరకు నిర్వహిస్తామన్నారు. సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు రూ.5లక్షల జీవితబీమా, రూ.50 వేలప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మద్దతుదారులు బండారు సుబ్బారావు, ఆరిమల్ల మల్లికార్జున, కోసూరి సురేష్, సునీల్, రాజ్‌కుమార్, నిశ్శకర సంతోష్, షేక్ కరీం తదితరులు పాల్గొన్నారు.

గాయపరిచిన వ్యక్తిని శిక్షించాలి

అల్లూరు, జూలై 17 : అన్నమయ్య జిల్లా ఒంటిమిట్ట మండలం పెన్నాపేరూరులో అరుగుపై కూర్చుని ఉన్న దళితుడిని అవమానించి, గాయపరచిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని రాష్ట్ర అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు బుధవారం ఓ ప్రకటనలో కోరారు. పకడ్బందీ చట్టాలు అమలువుతున్న ఈరోజుల్లో ఇంకా దళితులపై దౌర్జన్యాలు, దారుణాలు కొనసాగడం దారుణమని ఆయన పేర్కొన్నారు.

'ప్రకాశం'లో నూరుశాతం అడ్మిషన్లు

కందుకూరు, జూలై 17: అటానమస్ హోదా పొందిన ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో ఈ ఏడాది నూరుశాతం అడ్మిషన్లు జరిగాయని కరస్పాండెంట్ కంచర్ల రామయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్, మెకానికల్ మినహా మిగిలిన అన్ని బ్రాంచిల్లో నూరుశాతం సీట్లు భర్తీ అయ్యాయన్నారు. మేనేజ్‌మెంట్ సీట్లు పదిరోజులక్రితమే భర్తీ అయ్యాయని ఆయన తెలిపారు.

రేపు ఇంటూరికి సన్మానం

కందుకూరు, జూలై 17: టీడీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు శుక్రవారం సాయంత్రం 6 గంటలకు పట్టణంలోని వెంగమాంబ ఫంక్షన్‌హాలులో ఆత్మీయ సన్మానసభ ఏర్పాటు చేస్తున్నట్లు నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు రాయపాటి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఆరోజు సాయంత్రం పట్టణంలోని చర్చి సెంటర్ వద్ద నుంచి ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాల నుంచి అధికసంఖ్యలో ఎస్సీలు తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేడు బీజేపీ సమావేశం

కందుకూరు, జూలై 17: నియోజకవర్గ బీజేపీ విస్తృత స్థాయి సమావేశం గురువారం సాయంత్రం 4 గంటలకు స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు నియోజకవర్గ సమన్వయకర్త గట్టమనేని హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ నెల్లూరు పార్లమెంటరీ అధ్యక్షుడు శీపారెడ్డి వంశీధరరెడ్డి సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. పార్టీబాధ్యులు, కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు.

'టీఆర్ఆర్'కు అటానమస్ హోదా

కందుకూరు, జూలై 17: స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఈ విద్యాసంవత్సరం నుంచి అటానమస్ హోదా ఇస్తూ ఉత్తర్వులు జారీచేసిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం. రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అటానమస్ హోదా పదేళ్లపాటు కొనసాగుతుందని, ఆతర్వాత పునఃసమీక్ష ఉంటుందన్నారు.

ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ నియామకం

కావలి,జూలై 17: స్థానిక ఏరియా వైద్యశాల నూతన కమిటీని ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి బుధవారం ప్రకటించారు. కమిటీకి ఎమ్మెల్యే చైర్మన్‌గా కొనసాగనుండగా, తొలివిడతగా ముగ్గురు సభ్యులను ప్రకటించారు. టీడీపీకి చెందిన చవల రామకృష్ణ, ఆత్మకూరి నాగలక్ష్మి, జనసేనకు చెందిన పొబ్బా సాయివిఠల్‌ను సభ్యులుగా ప్రకటించారు. ప్రైవేట్ వైద్యశాలకు చెందిన ఒక డాక్టర్‌ను నియమించాల్సి ఉంది. మిగిలిన సభ్యులంతా వివిధ శాఖలకు చెందిన అధికారులు కొనసాగుతారు.

మహిళలకు సముచిత స్థానం : ఎమ్మెల్యే కావ్య

కావలి, జూలై17: పార్టీ పదవుల్లోనూ, ఇతర పదవుల్లోనూ మహిళలకు సముచిత స్థానం కల్పిస్తామని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. ముసునూరులోని టీడీపీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఆయన మహిళలతో ఆత్మీయసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా గెలవటం కోసం కృషిచేసిన ప్రతి ఒక్క మహిళకు ధన్యవాదాలు తెలిపారు. మీకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా కాపాడతానని చెప్పారు. మీ సమస్యలను నా సమస్యలుగా భావించి పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుత్తికొండ కిషోర్‌బాబు, గుంటుపల్లి శ్రీదేవి చౌదరి. అర్షియా బేగం, మలిశెట్టి విజయలక్ష్మి, పలువురు మాజీ కౌన్సిలర్లు, అనుబంధ విభాగాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

● **గంగపుత్రులకు అండగా ఉంటా...**

బిట్రగుంట : ఎంతగానో ఆదరించి తన విజయానికి కృషి చేసిన గంగపుత్రులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని కావలి ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకటక్రిష్ణారెడ్డి అన్నారు. బోగోలు మండలం కొత్తబంగారుపాలెం మత్స్యకారులతో బుధవారం సాయంత్రం ఆయన సమావేశమయ్యారు. అనంతరం మాట్లాడుతూ మత్స్యకారులతో తనకున్న సన్నిహిత సంబంధాలను వివరించారు. మత్స్యకారుల సమస్యలపై ఆప్కాప్ మాజీ చైర్మన్ కొండూరు పాల్‌శెట్టి ఎమ్మెల్యేకి వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాలేపాటి నాగేశ్వరావు, రామకృష్ణ, కే.వెంకటేశ్వర్లురెడ్డి, సుధీర్‌బాబు, బాబూరావు, భాస్కర్, శీనయ్య హర్ష పాల్గొన్నారు.

ఊరేగింపుగా విగ్రహాల తరలింపు



విగ్రహాలతో వస్తున్న వాహనానికి స్వాగతం పలుకుతున్న బీద గిరిధర్ తదితరులు

అల్లూరు, జూలై 17 : మండలంలోని తూర్పుగోగులపల్లి చంద్రశేఖరపురం రామాలయంలో ప్రతిష్ఠ కోసం సీతారామ లక్ష్మణ, ఆంజనేయుల విగ్రహాలు బుధవారం గ్రామానికి చేరుకున్నాయి. శ్రీరామ మందిరం ట్రస్ట్ తరఫున చేపట్టిన ఆలయ నిర్మాణానికి అవసరమైన విగ్రహాలను స్థానికులు ముంతా సోదరులు సహకారంతో ఏర్పాటు చేశారు. తమిళనాడులోని కంచి నుంచి వీటిని ప్రత్యేక వాహనంలో తరలించారు. టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ విగ్రహాలతో వచ్చిన వాహనానికి దిష్టి తీసి గ్రామంలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి తోట శీనయ్య, కీర్తి బాబూరావు, ట్రస్ట్ అధినేత డాక్టర్ కీర్తి వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఆశీస్సులు ఉంటే అన్నీ శుభాలే..!



కలిగిరమ్మను దర్శించుకున్న చెంచలబాబు

కలిగిరి, జూలై17: గ్రామదేవత కలిగిరమ్మను దర్శించుకుంటే అన్నీ శుభాలే జరుగుతాయని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పీ చెంచలబాబు యాదవ్ పేర్కొన్నారు. బుధవారం అమ్మవారికి జరిగిన ప్రత్యేక అభిషేకాలు, పూజాల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దుత్తలూరు మాజీ ఎంపీపీ రవీంద్రబాబు, నాయకులు బిజ్జం కృష్ణారెడ్డి, కాకు మహేష్, ఊసా మాల్యాద్రి,నిశ్శంకర సురేష్, కొండపల్లి వెంకట్రావు, కర్నాటి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారికి పొంగళ్లు, ఎ యంత్రం ఆలయం చుట్టూ ప్రభలు తిరగడం, రాత్రికి సుడిమాను ఉత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

ప్రభుత్వ స్థలంలోని కట్టడాలు కూల్చేయాలి : సీపీఐ



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

కందుకూరు, జూలై 17: పట్టణంలోని పామూరు బస్టాండ్ సెంటర్‌కు సమీపంలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి, నిర్మించిన కట్టడాలను కూల్చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్‌బాబు, కార్యవర్గ సభ్యుడు ఎస్కే హుస్సేన్‌లు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో రూ.కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని కొందరు దర్జాగా భవనాలు నిర్మించుకుంటుంటే రెవెన్యూ యంత్రాంగం చోద్యం చూస్తున్నదన్నారు. కొందరు అధికారులే వారికి సహకరిస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. పట్టణ శివార్లలో ఎక్కడైనా నిరుపేదలు తలదాచుకునేందుకు ప్రభుత్వస్థలంలో గుడిసెలు వేసుకుంటే హడావిడిగా ప్రొక్లెయిన్‌లు తీసుకెళ్లి వాటిని కూల్చివేయిస్తున్న రెవెన్యూ యంత్రాంగం కోట్ల విలువైన స్థలాలను ఆక్రమించిన భూకబ్జాదారుల జోలికి ఎందుకు వెళ్లటం లేదని వారు ప్రశ్నించారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ప్రభుత్వస్థలంలో నిర్మించి ఉన్న భవనాలను వెంటనే తొలగించాలన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు సోనా రాజు తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌పై గుంతలు : రాకపోకలకు ఇబ్బందులు



కావలి, జూలై17: పట్టణంలోని ఉదయగిరి రోడ్డులో ఉన్న ఆర్వోబీ ఫుట్‌పాత్ దెబ్బతిని గుంతలు పడ్డాయి. దీంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణ నడిబొడ్డున రైల్వే ట్రాక్ ఉండటంతో అటూఇటూ రాకపోకలు సాగించేందుకు ఒకే రైల్వే ఓవర్ బ్రిడ్జి ఉంది. కావలికి పడమర వైపున ఉన్న గ్రామాలకు రాకపోకలు సాగించేవారికి కూడా ఈ వంతెనే దిక్కు. దీంతో నిత్యం వాహనాల రాకపోకలతోపాటు ఫుట్‌పాత్‌పై ప్రజల రాకపోకలతో ఆర్వోబీ రద్దీగా ఉంటుంది. అలాంటి వంతెనపై ఉన్న ఫుట్‌పాత్ దెబ్బతిని గుంతలు పడి పోవటంతో పాదచారులు దానిపై రాకపోకలు సాగించాలంటే తరచూ ప్రమాదాలకు గురౌతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గుంతలను పూడ్చాలి.

శిథిలావస్థలో సంక్షేమ వసతి గృహాలు

సౌకర్యాలు లేక విద్యార్థుల అవస్థలు


శిథిలావస్థలో ఉన్న ఎస్సీ బాలుర వసతిగృహం


గదులలో పెచ్చులూడిన శ్లాబు

తోటపల్లిగూడూరు, జూలై 17: ఐదేళ్ల వైసీపీ పాలనలో సంక్షేమ వసతిగృహాలు నిర్వీర్యం అయ్యాయని, శిథిలావస్థకు చేరిన భవనాల్లో విద్యార్థులు అవస్థలు పడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఎస్సీ బాలుర వసతిగృహం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో పాటు చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి అపరిశుభ్రంగా ఉండడంతో విద్యార్థులు ఉండేందుకు ఇష్టపడడంలేదు. దీంతో ఈ భవనం నిరుపయోగంగా మారింది. 1990లో నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి మంత్రిగా, సీవీ శేషారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఈ భవనాన్ని ప్రారంభించారు. వసతి గృహానికి పక్కనే హైస్కూల్ ఉండడంతో 180 మంది విద్యార్థులతో కళకళలాడింది. గత వైసీపీ ప్రభుత్వం సంక్షేమ వసతిగృహాలను పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరాయి. సాంఘిక సంక్షేమ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోకపోవడంతో ఈ భవనం శిథిల స్థితికి చేరుకుంది. ఈ భవనంలోనే గత సంవత్సరం గ్రామీణ విద్యార్థుల సంఖ్య పది మందికి చేరింది. వార్డెన్, వాచ్‌మెన్, వంట మనిషి విధులు నిర్వహిస్తున్నప్పటికీ విద్యార్థులు ఒక్కరంటే ఒక్కరు కూడా ఉండకపోవడం విశేషం. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన ఎస్సీ హాస్టల్ భవనానికి మరమ్మతులు చేయించి పూర్వవైభవం తీసుకురావాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఘనంగా కురుగొండ్ల జన్మదిన వేడుకలు

సైదాపురం, జూలై 17: స్థానిక టీడీపీ కార్యాలయంలో మండల టీడీపీ అధ్యక్షుడు కట్టా మోహన్‌కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేకు కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీడీపీ సీనియర్ నాయకుడు పెమ్మసాని దిలీప్‌చౌదరి దాతృత్వంతో డాక్టర్ శ్రావణికి ఆక్సిజన్ కిట్లను అందచేశారు. రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు సుబ్రహ్మణ్యంరాజు, మేడికొండ రమణయ్య నాయుడు, హరనాథ్‌రెడ్డి, రాజశేఖర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

రాపూరు(డక్కిలి): ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ జన్మదినం సందర్భంగా టీడీపీ నాయకులు ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు, పాలు అందచేశారు. రాపూరు సెంటరులో కేకు కట్‌చేసి ప్రజలకు పంచి పెట్టారు. టీడీపీ సీనియర్ నాయకులు బొట్టా హజరత్ నాయుడు నియోజకవర్గంలో నిర్వహించిన వేడుకలకు హాజరై కురుగొండ్లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామకృష్ణ, హజరత్ నాయుడులు ఒకరికొకరు కెక్ తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ప్రసన్న, పార్టీ నాయకులు దందవోలు వెంకటేశ్వర్లురెడ్డి, ఏదోటి కోటేశ్వర నాయుడు, కొండ్లపూడి రాఘవరెడ్డి, చెన్ను భాస్కరరెడ్డి, తాతిపల్లి ప్రసాద్ నాయుడు, బొమ్మిరెడ్డి రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సైదాపురం పీహెచ్‌సీలో డాక్టర్ శ్రావణికి ఆక్సిజన్ కిట్లు అందజేస్తున్న టీడీపీ నాయకులు

నేడు కౌలు రైతులకు కార్డుల పంపిణీ

ఇందుకూరుపేట, జూలై 17: మండలంలోని కొత్తూరు ఎంపీడీవో కార్యాలయంలో గురువారం కౌలు రైతులకు సాగు ధ్రువీకరణ కార్డులను పంపిణీ చేయనున్నట్లు టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మునగాల రంగారావు తెలిపారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కార్డులను పంపిణీ చేస్తారని ఆయన బుధవారం తెలిపారు.

భక్తి శ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు

కోవూరు, జూలై 17: స్థానిక పురాతన కోదండ రామస్వామి ఆలయంలో బుధవారం తొలిఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. 15 రకాల సుగంధ పరిమళ పుష్పాలతో పుష్పయాగం చేశారు. పూలంగి సేవ, పల్లకీసేవ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆలయ పూజారి శ్రీకాంతాచార్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. కోవూరు, పడుగుపాడుల్లోని చెన్నకేశవస్వామి ఆలయం, సాయిబాబా మందిరం, కృష్ణ మందిరాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.


కోవూరు: కోదండ రామస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కొడవలూరు : తొలి ఏకాదశి పండుగను బుధవారం ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలో కొడవలూరు, నార్తు రాజుపాళెం, వెంకన్నపురం గ్రామాల్లో శ్రీధరస్వామి, వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం గ్రామోత్సవం జరిగింది.

ఘనంగా మొహర్రం వేడుకలు

కోవూరు, జూలై 17: మొహరం పర్వదినం సందర్భంగా స్థానిక బజారు కూడలిలో పీర్లకు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా నిప్పుల గుండం ఏర్పాటుచేశారు. పెద్దసంఖ్యలో భక్తులు పీర్లకు మొక్కులు చెల్లించుకున్నారు. పీర్లచావిడిని విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. పెద్దపడుగుపాడులోని పీర్లచావిడిలో అన్నదాన కార్యక్రమాన్ని టీడీపీ పార్లమెంటు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర్లురెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కే అహమ్మద్, మహమ్మద్, నాజర్, ఫైరోజ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన కసుమూరు

● బారులు తీరిన వాహనాలు

వెంకటాచలం, జూలై 17: నెల్లూరు బారాషాహిద్ దర్గా వద్ద జరుగుతున్న రొట్టెల పండుగకు వచ్చిన భక్తులతో బుధవారం కసుమూరు గ్రామం కిటకిటలాడింది. భక్తులు మస్తాన్ వలీ దర్గాను దర్శించుకుని ప్రార్థనలు చేశారు. వెంకటాచలం నుంచి కసుమూరు వరకు బస్సులు, వాహనాలు బారులు తీరాయి. యాత్రికులు తెచ్చుకున్న వాహనాలను చెరువు కట్ట, స్వామి బంగ్లా వద్ద పార్కింగ్ చేయించారు. కసుమూరు ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేయగా, వక్ఫ్‌బోర్డు అధికారులు భక్తులకు చందన్ మహల్, చెరువు కట్ట, బ్యాంకు తదితర ప్రదేశాల్లో చలివేంద్రాలు, ప్రత్యేక షామియాలు ఏర్పాటుచేశారు. దర్గా ప్రధాన మార్గంలో పోలీస్‌శాఖ వారు అవుట్ పోస్టు ఏర్పాటుచేసి భారీ బందోబస్తు చర్యలు చేపట్టారు.


మస్తాన్‌వలీ దర్గాను దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

ఫోక్సో కేసులో నిందితుడికి రిమాండ్

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 17: మండలంలోని దామరమడుగుకు చెందిన కేసీ కేశవులు అనే యువకుడిపై బుధవారం ఫోక్సో కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. బుధవారం నిందితుడిని కోర్టుకు హాజరుపరచగా న్యాయమూర్తి ఆదేశం మేరకు రిమాండ్‌కు తరలించినట్టు వారు తెలిపారు.

వితరణశీలి కన్నుమూత

కోవూరు, జూలై 17: పట్టణంలో పలు కార్యాలయాలకు, ప్రభుత్వ వైద్యశాల నిర్మాణానికి స్థలం కేటాయించడమే కాకుండా ఆర్థిక సహాయం అందించిన కాటంరెడ్డి వెంకురెడ్డి సతీమణి కాటంరెడ్డి అనసూయమ్మ బుధవారం నెల్లూరు నగరంలో కన్నుమూశారు. ఇటీవల కోవూరులోని కోదండ రామస్వామి ఆలయ పునర్నిర్మాణం ఆమె కుటుంబ సభ్యులు పూర్తిచేశారు. వితరణశీలిగా పేరొందిన ఆమె మృతితో కోవూరు పట్టణంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. అంత్యక్రియలు గురువారం నెల్లూరు నగరంలోని అన్నమయ్య సర్కిల్ ప్రాంతంలోని తమ ఇంటి నుంచి ప్రారంభమవుతాయని ఆమె కుమారుడు కృష్ణారెడ్డి తెలిపారు.


కాటంరెడ్డి అనసూయమ్మ (ఫైల్)

గురువుకు కాకాణి నివాళి

పొదలకూరు, జూలై 17: తనకు విద్యాబుద్ధులు నేర్పిన గురువు సిద్ధయ్య మాస్టరు మృతి చెందడంతో మాజీ మంత్రి కాకాణి గోవర్దన్ రెడ్డి బుధవారం అశ్రునివాళులు అర్పించారు. కాకాణి పొదలకూరు జడ్పీ హైస్కూల్‌లో ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుకున్న సమయంలో సిద్ధయ్య మాస్టరు ఆయనకు బోధించారు. సిద్ధయ్య మాస్టరు మృతి చెందడంతో కాకాణి తన కుటుంబ సభ్యులతో కలిసి మాస్టరు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి


భక్తుల సేవలో విద్యార్థులు, రెడ్‌క్రాస్ వలంటీర్లు

హలో.. హలో.. హలో..!



నెల్లూరు(సిటీ), జూలై 17 : హలో.. హలో..! ఏం వినపడటం లేదు.. నువ్వు ఎక్కడున్నావు..? నేను ఇక్కడున్నాను..! బారాషహీద్ దర్గా రొట్టెల పండుగలో ఇదీ సంగతి. ఇక్కడకు భారీగా తరలివచ్చిన భక్తుల తాకిడికి సెల్ ఫోన్ల సిగ్నల్స్ చాలక నెట్‌వర్కు బలహీనంగా మారింది. సెల్ ఫోన్ టవర్ల సామర్థ్యానికి మించి ఫోన్లు ఉండటంతో ఈ దుస్థితి తలెత్తినట్లు నిపుణులు అంచనా వేస్తుండగా ఫోన్లలో సంభాషణలుతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అటు ఫోన్లలో ఇంటర్‌నెట్ సౌకర్యం పూర్తి స్థాయిలో లేక అవస్థలు పడుతున్నారు. ప్రతి ఇద్దరిలో ఈ సమస్య కనిపిస్తోంది.

భక్తుల సేవలో వైద్యులు, విద్యార్థులు

నెల్లూరు (వైద్యం/సిటీ), జూలై 17: బారాషహీద్ దర్గాలో ప్రారంభమైన రొట్టెల పండగకు తరలివచ్చిన భక్తుల కోసం వైద్య శిబిరాలు ఏర్పాటయ్యాయి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి అస్వస్థతకు గురైన రోగులకు వైద్య చికిత్సలు అందించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రొట్టెల పండుగకు వచ్చే వారికి అన్ని విధాలా వైద్య చికిత్సలు అందిస్తామని వెల్లడించారు. అత్యవసర చికిత్సల కోసం అంబులెన్స్‌ల ద్వారా ప్రభుత్వం జీజీహెచ్‌కి పంపిస్తామని చెప్పారు. అలాగే అపోలో, మెడికవర్, కిమ్స్, డాక్టర్ యశోధర, ఎనెల్ తదితర ఆసుపత్రి వర్గాలు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి బాధితులకు చికిత్సలు అందిస్తున్నారు. రెడ్‌క్రాస్ నిర్వాహకులు కూడా వైద్య శిబిరాలతో పాటు వలంటీర్లతో పాటు ప్రైవేట్ విద్యా సంస్థల విద్యార్థులు భక్తులకు సేవలు అందిస్తున్నారు.



మహిళలకు చికిత్స చేస్తున్న వైద్యశాఖ సిబ్బంది, కిమ్స్ వైద్యుడు

దర్గా సమీపంలోని పాఠశాలలకు సెలవులు

నెల్లూరు(విద్య), జూలై 17: రొట్టెల పండుగను పురస్కరించుకుని బారా షహీద్ దర్గా సమీపంలోని పాఠశాలలకు మూడు రోజుల పాటు సెలవులు ప్రకటించినట్లు డీఈవో రామారావు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో యాత్రికులు ఈ ఉత్సవానికి హాజరవుతున్న నేపథ్యంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు స్థానిక పాఠశాలలకు సెలవులు ప్రకటించామన్నారు. ప్రస్తుతం ప్రకటించిన సెలవులను ఆగస్టు నెలలో అధికారిక సెలవు దినాల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించి విద్యకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత పాఠశాలల యాజమాన్యాలకు ఆదేశాలిచ్చామన్నారు. నగరంలోని మాగుంటలేఅవుట్ ఎస్‌ఆర్‌ఆర్‌కే, కేకేఆర్, లిటిల్ ఏంజెల్స్, సెయింట్ జోసఫ్స్, ఫత్తేఖాన్‌పేట మునిసిపల్ ఉన్నత పాఠశాల, నగరపాలక ప్రాథమిక పాఠశాల, దర్గామిట్ట జడ్పీ బాలుర, బాలికల పాఠశాలలు, అవెన్యూస్, నగరపాలక సంస్థ అప్పర్ ప్రైమరీ స్కూల్, కస్తూరిదేవి పాఠశాల, సరస్వతి నగర్ రత్నం, రత్నం ఏసీ క్యాంపస్, శిల్ప పాఠశాల, సూర్య పబ్లిక్ స్కూల్, ప్రియాంక స్కూల్, వెలాంగణి స్కూల్, వాగ్దా, కేఎస్ వ్యాస్ పాఠశాలలు కలిపి 19 పాఠశాలలు సెలవులు ఇచ్చామన్నారు. ఈ పాఠశాలలకు సెలవులు ప్రకటించిన నేపథ్యంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు యాత్రికులకు వీలైనంత వసతి కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించామని తెలిపారు.

అన్నదానం మహాదానం



నెల్లూరు(సాంస్కృతికం), జూలై 17 : నెల్లూరు బారాషహీద్ దర్గా గంధమహోత్సవం, రొట్టెల పండుగకు సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తులకు అన్నదానం చేయడం మహాదానంగా భావించి అన్నదానం చేస్తున్నామని బెంగళూరుకు చెందిన ట్రాన్స్‌పోర్టు వ్యాపారి అలీమ్ తెలిపారు. తాము మూడేళ్లుగా రొట్టెల పండుగ ముగిసేవరకు తమశక్తి మేరకు భక్తులకు అన్నదానం చేస్తున్నామని తెలిపారు. ఈ సేవా కార్యక్రమంలో తమ కుటుంబంలో 10 మంది పాల్గొంటున్నామన్నారు.

● మేము పట్టిన రొట్టెలన్నీ బంగారమే..

మేము 20 ఏళ్లుగా బారాషహీద్ గంధమహోత్సవం, రొట్టెల పండుగకు వస్తున్నాం. మేము పట్టుకున్న రొట్టెలు వల్ల మా కోర్కెలు తీరుతున్నాయి. ఈ ఏడాది సంతానం, వివాహం రొట్టెలను పట్టుకున్నామని బెంగళూరుకు చెందిన ఎండీ నవాజ్‌ఖాన్ కుటుంబ సభ్యులు తెలిపారు.



● దర్గాలో ఏర్పాట్లు సూపర్

బారాషహీద్ దర్గాలో రొట్టెల పండుగ కోసం చేసిన ఏర్పాట్లు సూపర్ అని కర్నాటక హోస్‌పేటకు చెందిన అస్లాంఖాన్ తెలిపారు. నేను ఈ ఏడాదే వచ్చాను. నా కుమార్తెలు 5ఏళ్లుగా వస్తున్నారు. మేము గత ఏడాది గృహం రొట్టెను పట్టుకున్నాం. గృహం నిర్మించుకున్నాం. అందుకే రొట్టెను వదిలి బారాషహీదులను దర్శించుకుని వెళుతున్నాం.



మొరాయించిన పైప్‌లైన్

నెల్లూరు(సాంస్కృతికం) : బారాషహీద్ దర్గాలో నీటి సరఫరా కోసం వేసిన పైపులైన్ బుధవారం మరమ్మతులకు గురైంది. ఫలితంగా ఉదయం 8గంటల నుంచి దర్గాలో మరుగుదొడ్లకు, షవర్ బాతింగ్‌కు నీరు సరఫరా నిలిచిపోయింది. దీంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. నగర పాలక సంస్థ ఇంజనీర్లు 2గంటలు శ్రమించి నీటి సరఫరాకు చర్యలు తీసుకున్నారు. దర్గాలో గాలికి దుమ్ము రేగుతుండడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి

● ఆలయాల్లో విశేష పూజలు ● అలరించిన ప్రత్యేక అలంకారాలు


మాగుంట లేఅవుట్‌లో శేషశయన అలంకారంలో వేంకటేశ్వరస్వామి

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 17 : జిల్లాలో బుధవారం తెలుగువారి తొలి పండుగ తొలి ఏకాదశిని జిల్లా ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అన్ని వైష్ణవ ఆలయాల్లో ఉదయం, రాత్రి వేళల్లో అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకారాలు, ఉత్సవాలు నిర్వహించారు. నగరంలో ఇంటింటా తొలి ఏకాదశి పర్వదినంను ఆనంద ఉత్సాహాలతో జరుపుకున్నారు. గృహాలను మంగళతోరణాలతో అలంకరించి లక్ష్మీనారాయణకు ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యం, పేలపిండి, పాయసం వంటివి పెట్టి ఆరాధనలు చేశారు.


మహాత్మాగాంధీ నగర్ కృష్ణమందిరంలో స్వామివారి ప్రత్యేక అలంకారం

● తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో..

తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో ఉదయం శ్రీదేవి భూదేవి సమేత రంగనాథ స్వామికి 108 లీటర్ల పాలతో విశేషంగా తిరుమంజన సేవలు, అర్చన, నివేదనలు జరిగాయి. మూలవిరాట్‌లకు పుష్పాలంకారం జరిగింది. సాయంత్రం రంగనాథుడుకి బంగారు గరుడసేవలో పేట ఉత్సవం కనుల పండువగా జరిగింది. ఈ ఉత్సవాలలో రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పాల్గొని రంగనాథుడిని దర్శించుకున్నారు. ఉభయకర్తలు, ధర్మకర్తలు, ఈవో పర్యవేక్షించారు.

● మాగుంటలేఅవుట్‌లోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో పంచ కలశ స్నపన తిరుమంజనం, విశేష అలంకారం పూజలు జరిగాయి. స్వామివారికి శేష శయన అలంకారం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.


అష్టలక్ష్మీ ఆలయంలో కృష్ణస్వామికి పుష్పాలంకారం

● పప్పులవీధి ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి విశేష అభిషేకాలు జరిగాయి. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

● సుజాతమ్మకాలనీ అష్టలక్ష్మి ఆలయంలో శ్రీకృష్ణస్వామికి అభిషేకాలు జరిగాయి. విశేష పుష్పాలంకారం భక్తులను ఆకట్టుకుంది. మహాత్మాగాంధీనగర్ కృష్ణమందిరంలో స్వామివారికి సాయంత్రం తులసీదళ అర్చన, పూలంగిసేవ, ఊంజల్‌సేవలు జరిగాయి. భక్తులు ధర్మకర్తలు పాల్గొన్నారు. అలాగే నగరంలోని అన్ని వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.

అమ్మ ఆశీస్సులు ఉంటే అన్నీ శుభాలే..!

కలిగిరి, జూలై 17: గ్రామదేవత కలిగిరమ్మను దర్శించుకుంటే అన్నీ శుభాలే జరుగుతాయని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పీ చెంచలబాబు యాదవ్ పేర్కొన్నారు. బుధవారం అమ్మవారికి జరిగిన ప్రత్యేక అభిషేకాలు, పూజాల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దుత్తలూరు మాజీ ఎంపీపీ రవీంద్రబాబు, నాయకులు బిజ్జం కృష్ణారెడ్డి, కాకు మహేష్, ఊసా మాల్యాద్రి,నిశ్శంకర సురేష్, కొండపల్లి వెంకట్రావు, కర్నాటి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారికి పొంగళ్లు, ఆ యంత్రం ఆలయం చుట్టూ ప్రభలు తిరగడం, రాత్రికి సుడిమాను ఉత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

ఎన్‌ఎంసీలో ఫోర్జరీ స్కాంపై చర్యలేవి?

నెల్లూరు(సిటీ), జూలై 17 : నెల్లూరు కార్పొరేషన్‌లో వెలుగు చూసిన ఫోర్జరీ సంతకాల స్కాంపై ఇప్పటి వరకు ఎందుకు ఎఫ్‌ఐఆర్ నమోదు చేయలేదని న్యాయవాది కాకు మురళి ప్రశ్నించారు. బుధవారం నెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫోర్జరీలపై వివరాలు జోడించి లిఖితపూర్వక ఫిర్యాదు చేస్తే కమిషనర్ ప్రాథమిక దర్యాప్తు అనంతరం అధికారులను సస్పెండ్ చేశారని తెలిపారు. తదుపరి దర్యాప్తులో భాగంగా కమిషనర్ లిఖితపూర్వకంగా పోలీసు శాఖకు ఫిర్యాదు చేస్తే ఇంత వరకు ఎఫ్‌ఐఆర్ కట్టలేదన్నారు. పోలీసులు ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. ఈ విషయంలో పురపాలక శాఖ మంత్రి నారాయణ, రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి జోక్యం చేసుకోవాలని కోరారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన పనబాక భూలక్ష్మి


లోకేష్‌తో పనబాక భూలక్ష్మి, టీడీపీ నేతలు

నెల్లూరు(వైద్యం), జూలై 17 : రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను తెలుగు మహిళా నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షురాలు పనబాక భూలక్ష్మి బుధవారం విజయవాడలోని లోకేష్ నివాసంలో కలిశారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు పూర్తయిన సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ లీగల్ సెల్ నేత, న్యాయవాది గంగరాజు, గంగబాబు, గంగాధరయ్య, రాయపు హరి తదితరులు పాల్గొన్నారు.

సాహితీవేత్త పాముల సాయిప్రసాద్ మృతి

నెల్లూరు(హరనాథపురం), జూలై 17 : సాహితీవేత్త, ప్రభుత్వ అధ్యాపకుల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు పాముల సాయిప్రసాద్ మృతి చెందారు. ఆయన వైకుంఠ సమారాధన కార్యక్రమాన్ని బుధవారం నగరంలోని ఆయన నివాసంలో నిర్వహించారు. సాయిప్రసాద్ మూలస్థానేశ్వర స్వామి చరిత్ర, రంగనాయకుల స్వామి గుడి చరిత్ర, అనేక తెలుగు వ్యాకరణ పుస్తకాలను రచించారు. కాగా ఆయన కుమారుడు వీపీఎస్‌టీ రాంప్రసాద్ ఏపీజీఈఏ జిల్లా కార్యదర్శిగా, టీపీ గూడూరు మండల స్టాటిస్టికల్ అధికారిగా పనిచేస్తున్నారు.


సాయిప్రసాద్ (ఫైల్)

ముగ్గురు ఆర్డీవోల చుట్టూ

ఓటరు జాబితా వివాదం

- తహసీల్దార్లు, బీఎల్వోల లాగిన్ ఐడీలన్నీ వైసీపీ నేతలకు అప్పగింత
- ప్రైవేటు కార్యాలయాల నుంచీ చంద్రగిరి ఓటర్ల చేర్పులు, తొలగింపులు
- ఓ ప్రైవేటు విద్యా సంస్థ విద్యార్థుల ప్రమేయం
- విచారణకు ప్రత్యేకాధికారిని నియమించే అవకాశం



తిరుపతి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి నియోజకవర్గ ఓటరు జాబితాలో అక్రమాలు జరిగాయని ఎన్నికలకు ముందు నుంచీ టీడీపీ వర్గీయులు గగ్గోలు పెడుతున్న వ్యవహారంలో ముగ్గురు డిప్యూటీ కలెక్టర్ల పేరు తెరమీదకు వస్తున్నాయి.గత ఐదేళ్లలో ఎక్కువ కాలం పాటు తిరుపతి ఆర్డీవోగా కనక నరసారెడ్డి పనిచేశారు. ఆయన గతేడాది సెప్టెంబరులో బదిలీ కావడంతో తర్వాత ప్రస్తుత ఆర్డీవో నిశాంత్ రెడ్డి ఆ స్థానంలో నియమితులయ్యారు. 2017-18 మధ్య తిరుపతి రూరల్ తహసీల్దారుగా పనిచేసిన మీసాల కిరణ్‌కుమార్ ఆ సమయంలో అప్పటి చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డికి సన్నిహితంగా వ్యవహరించారన్న ఆరోపణలున్నాయి. అప్పటి నుంచే 2024 ఎన్నికల్లో వైసీపీ గెలుపుకోసం అనుకూలంగా ఓటర్ల జాబితాను రూపొందించేందుకు ప్రణాళిక వేసినట్టు టీడీపీ వర్గీయులు ఆరోపిస్తున్నారు. తర్వాత డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి రాగా చెవిరెడ్డికి ఓఎస్డీగా నియమితులయ్యారు. తర్వాత గూడూరు ఆర్డీవోగా బదిలీ అయ్యారు. గూడూరు ఆర్డీవోగా పనిచేస్తూ కూడా తరచూ చంద్రగిరి నియోజకవర్గ ఓటరు జాబితా తయారీలో జోక్యం చేసుకున్నారని, దాదాపు ఆయనే పర్యవేక్షించేవారని చంద్రగిరి టీడీపీ ఇంచార్జి పులివర్తి నానీ ఎన్నికల ముందు ఈసీకి, ప్రభుత్వానికి అసంఖ్యాక ఫిర్యాదులు చేశారు. తిరుపతి ఆర్డీవోగా కనకనరసారెడ్డి కూడా చెవిరెడ్డికి అనుకూలంగా వ్యవహరించారని, ఆయన తర్వాత వచ్చిన ప్రస్తుత ఆర్డీవో నిశాంత్‌రెడ్డి కూడా అదే పంథా అవలంబించారని ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో చంద్రగిరి ఓటరు జాబితాలో బోగస్ ఓటర్ల చేర్పులు, టీడీపీ అనుకూల ఓటర్ల తొలగింపులకు వీరిదే ప్రధాన బాధ్యత అని ఫిర్యాదుల్లో పేర్కొన్నారు.

తిరుపతి, బెంగళూరు నుంచీ మార్పుచేర్పులు

తిరుపతిలో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి ప్రైవేటు కార్యాలయం నుంచీ ప్రధానంగా ఓటర్ల జాబితా మార్పుచేర్పులు జరిగాయని టీడీపీ నేతలు ఫిర్యాదుల్లో ఆరోపించిన విషయం తెలిసిందే. అక్కడ చెవిరెడ్డి వద్ద పీఆర్వోగా పనిచేసిన ఓ రిటైర్డు డిప్యూటీ కలెక్టర్ పాత్ర కూడా కీలకమని ఫిర్యాదుల్లో ఆరోపించారు. అలాగే బెంగళూరులో ఆయన రియల్ ఎస్టేట్ వ్యాపార భాగస్వాముల కార్యాలయాల నుంచీ ఈ పనులు జరిగాయని తాజా ఫిర్యాదుల్లో ఆరోపించారు. చంద్రగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల తహసీల్దార్లు, బీఎల్వోలు, ఆర్డీవో కార్యాలయంలో చంద్రగిరి నియోజకవర్గ ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు లాగిన్ ఐడీలు, పాస్ వర్డులను ఈ రెండు ప్రైవేటు కార్యాలయాల సిబ్బందికి అందజేశారని, వాటి ఆధారంగా బోగస్ ఓటర్లను భారీ ఎత్తున చేర్పించడం, టీడీపీ సానుభూతిపరుల ఓట్లు తొలగించడం జరిగిందని ఆ పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. జాబితాలో చేర్పులు, తొలగింపుల వ్యవహారం చేపట్టడానికి తిరుపతిలోని ఓ ప్రైవేటు విద్యా సంస్థ విద్యార్థులను వినియోగించారని, ఆ సంస్థ యజమాని అన్నమయ్య జిల్లా కలికిరి మండలానికి చెందిన వారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

అందరినీ విచారించనున్న సీఐడీ అధికారులు

గత ఐదేళ్లలో తిరుపతి ఆర్డీవోలుగా పనిచేసిన కనకనరసారెడ్డి, నిశాంత్‌రెడ్డిలతో పాటు గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్‌ను సీఐడీ అధికారులు విచారించనున్నారు. అలాగే ఆరు మండలాల తహసీల్దార్లు, బీఎల్వోలు, కంప్యూటర్ ఆపరేటర్లు, రిటైర్డు డిప్యూటీ కలెక్టర్, ప్రైవేటు విద్యా సంస్థకు చెందిన విద్యార్థులను కూడా ప్రశ్నించనున్నట్టు సమాచారం. ముఖ్యంగా గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్ కాల్ డేటాను పరిశీలించాలని టీడీపీ నేతలు తమ ఫిర్యాదులో పేర్కొన్న నేపధ్యంలో దానిపైనా దృష్టి సారించే ఆస్కారం వుంది. తిరుపతిలోని చెవిరెడ్డి ప్రైవేటు కార్యాలయానికి ఆయన తరచూ రావడం, ఆరు మండలాల తహసీల్దార్లను అక్కడికి పిలిపించుకోవడం వంటి వాటికి సంబంధించి సీసీ కెమెరాల ఫుటేజీలు కూడా తమ వద్ద వున్నాయని టీడీపీ నేతలు చెబుతున్నారు. కాల్ డేటాను కూడా విశ్లేషించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అందువల్ల సీఐడీ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకునే అవకాశం కనిపిస్తోంది.

ప్రత్యేకాధికారి నియామకానికి సీఎం చొరవ

తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల సందర్భంగా తిరుపతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో వెలుగు చూసిన ఓటరు కార్డుల అక్రమ డౌన్‌లోడింగ్, నకిలీ ఓటరు కార్డుల తయారీ వ్యవహారం దేశవ్యాప్తంగా కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్న చంద్రబాబు గత ఎన్నికల్లో చంద్రగిరి నియోజకవర్గ ఓటరు జాబితా అక్రమాలు కూడా తెలియడంతో వీటిపై ప్రత్యేక దృష్టి సారించినట్టు సమాచారం. ఈ రెండు అంశాలను కేస్ స్టడీలుగా తీసుకుని భవిష్యత్తులో రాష్ట్రంలో ఎక్కడా పునరావృతం కాకుండా చూడాలని భావిస్తున్నట్టు తెలిసింది. అందులో భాగంగా తిరుపతి, చంద్రగిరి ఓటర్ల జాబితాల అక్రమాలపై లోతుగా విచారణ జరిపించేందుకు ప్రత్యేకాధికారిని నియమించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్టు టీడీపీ వర్గాల ద్వారా తెలిసింది.వైసీపీ నేతలు చాలా తేలిగ్గా తీసుకుని ఓటర్ల జాబితాలో ఇష్టానుసారం అక్రమంగా మార్పుచేర్పులు చేయించారని, అయితే తాజాగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో పరిణామాలు ఆషామాషీగా వుండవని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. ఓటర్ల జాబితా అక్రమాలకు బాధ్యులైన వారిపై తీవ్రస్థాయి చర్యలే వుంటాయని చెబుతున్నాయి. దీన్నిబట్టి రానున్న రోజుల్లో తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు సంభవించే అవకాశాలున్నాయని భావించాల్సి వస్తోంది.





రుయాస్పత్రి ఆవరణలో మహాప్రస్థానం వాహనాలు - మృతదేహాన్ని ప్రైవేటు వాహనంలో తీసుకెళ్తున్న బాధితులు

కాసులిస్తేనే కదుల్తాం


'మహా ప్రస్థానం'లో మృతదేహం తరలింపునకు రూ. 4 వేల డిమాండ్

తిరుపతి(వైద్యం), జూలై 17 : రుయాస్పత్రిలో రోగి డిశ్చార్జి అయ్యేలోపు అన్నింటికీ చేతులు తడపుతూ బయట పడటం సాధారణమైపోయింది. ఆఖరుకు మృతదేహాల తరలింపులోనూ దయ చూపడం లేదనడానికి తాజా సంఘటనే ఉదాహరణ. చిట్టమూరు మండలం యాకసిరికి చెందిన జె.వెంకటయ్య(57) రుయాస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. స్వగ్రామానికి మృతదేహాన్ని ఉచితంగా తీసుకువెళ్లేందుకు ఆస్పత్రిలో అంబులెన్సులు (మహాప్రస్థానం) ఉన్నాయని తెలుసుకొని వెంకటయ్య కుటుంబ సభ్యులు సంప్రదించారు. వాహనం ఉచితమే గాని శుభ్రత, డీజిల్, డ్రైవరుకు కలిపి రూ.4 వేలు చెల్లించాలని వాహనాల నిర్వాహకులు చెప్పారు.అంత స్థోమత లేదని, ఊరిలో ఎవరినైనా అడిగి రూ.2 వేలు ఇవ్వగలమని ప్రాధేయపడ్డా కుదరదని నిర్వాహకులు తెగేసి చెప్పారు.దీంతో గత్యంతరం లేక సమీప బంధువు సాయంతో ఓ ప్రైవేటు వాహనంలో మృతదేహాన్ని తీసుకువెళ్లారు. ఆస్పత్రిలో వారం రోజులపాటు ప్రతి చిన్న పనికీ డబ్బులు ముట్టజెప్పాల్సి వచ్చిందని వారు కన్నీరు మున్నీరయ్యారు.మహాప్రస్థానం వాహన నిర్వాహకులు అందిన కాడికి దోచుకోవడంపై పలుమార్లు బాధితులు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోతోంది. ఏఆర్ఎంవో హరికృష్ణను ఈ విషయమై వివరణ కోరగా మహా ప్రస్థానం వాహనాల్లో మృతదేహాలను ఉచితంగానే తీసుకువెళ్లాలన్నారు.నగదు తీసుకుంటే తక్షణమే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కొటాల సమీపంలో చిరుత సంచారం

రాత్రి వేళ పొలాల వద్దకు రైతులు వెళ్లొద్దని అటవీ శాఖ అధికారుల సూచన

చంద్రగిరి, జూలై 17: చంద్రగిరి మండలం కొటాల గ్రామ సమీపంలో ఓ చిరుత పులి సంచరిస్తోంది.జగనన్న కాలనీ వెనుకభాగంలో ఉన్న గుట్టలో మంగళవారం సాయంత్రం చిరుత సంచరిస్తోందని తెలిసిన జగనన్న కాలనీ వాసులు, కొటాల, పుల్లయ్యగారిపల్లె, నారావారిపల్లె, ఎ.రంగంపేట గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. గుట్టలో పెద్ద బండ రాతిపై చిరుత పులిని గమనించిన జనం వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. రాత్రి సమయంలో కూడా చిరుత పులి బండరాతిపైనే ఉండడంతో జగనన్న కాలనీవాసులు బాణా సంచి కాల్చి, డప్పులు వాయించారు. అటవీ సిబ్బంది జగనన్న కాలనీతో పాటు, కొటాల, పుల్లయ్యగారిపల్లె, ఎ.రంగంపేట, నారావారిపల్లె గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. రైతులు రాత్రి వేళ పొలాల వద్దకు వెళ్ళవద్దని సూచించారు.పనపాకం ఎఫ్ఆర్వో మాధవి మాట్లాడుతూ తమ సిబ్బందితో జగనన్న కాలనీ వద్ద చిరుత సంచారంపై నిఘా వుంచనున్నట్లు తెలిపారు. కెమెరా ట్రాప్స్ ద్వారా చిరుత సంచారం కనిపెట్టి, బోన్లు ఏర్పాటు చేస్తామన్నారు.



గుట్టలో బండరాయిపై చిరుత పులి ←

టీటీడీ అధికారుల అత్యుత్సాహం

పొగాకు ఉత్పత్తులు సీజ్ చేయడంపై తిరుచానూరు వ్యాపారుల ఆగ్రహం

తిరుచానూరు, జూలై 17:మాంసం, పొగాకు విక్రయాల నిషేధంపై ముందస్తుగా నోటీసులు కూడా ఇవ్వకుండా టీటీడీ అధికారులు సరుకు స్వాధీనం చేసుకోవడం తిరుచానూరులో విమర్శలకు దారితీసింది. వారం రోజుల క్రితం హిందూ సంఘాలు తిరుచానూరులో మాంసం , పొగాకు ఉత్పత్తులు అమ్మకుండా చర్యలు తీసుకోవాలని టీటీడీ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో మాంసం, పొగాకు ఉత్పత్తులు అమ్మకుండా మాడవీధుల్లో వ్యాపారులకు అవగాహన కల్పించాలని పంచాయతీ ఈవోకు టీటీడీ విజిలెన్స్ అధికారులు సూచించినట్లు సమాచారం.తరువాత పంచాయతీ సిబ్బంది మాడ వీధుల్లో ఉన్న షాపుల వద్దకు వెళ్లి సిగరెట్లు, బీడీలు విక్రయించరాదని చెప్పారు. పంచాయతీ నుంచి నోటీసులు ఇచ్చి, స్థానిక వ్యాపారులకు అవగాహన కల్పించాక పొగాకు ఉత్పత్తులపై నిషేధం అమల్లోకి తెచ్చివుంటే బాగుండేది.అలా కాకుండా టీటీడీ ఎస్టేట్ విభాగంలో తహసీల్దారు లలితాంజలి, ఏవీఎస్వో సతీష్‌కుమార్, పంచాయతీ అధికారులు బుధవారం ఉదయం ఆలయ మాడవీధుల్లోని దుకాణాల్లో తనిఖీలు చేశారు.దుకాణాల్లో వున్న సిగరెట్లు, బీడీలను వెలుపల వేసి మూటకట్టి శ్రీవారి సేవకుల ద్వారా విజిలెన్స్ కార్యాలయానికి తీసుకెళ్లారు.దీంతో దుకాణదారులంతా అక్కడికెళ్లి ముందస్తు సమాచారం లేకుండా అంగళ్లలో సరుకును ఎలా తీసుకెళ్తారంటూ గట్టిగా ప్రశ్నించారు. పొగాకు ఉత్పత్తులు విక్రయించవద్దని నోటీసులు ఎప్పుడైనా ఇచ్చారా.. లేదా సమావేశం పెట్టారా.. పోనీ నిషేధం ఏమైనా ఉందా...మీ దగ్గర ఏవైనా ఉత్తర్వులున్నాయా అని ప్రశ్నించడం మొదలెట్టారు.దీంతో వారికి సమాధానం చెప్పలేక తీసుకెళ్లిన పొగాకు ఉత్పత్తులను తిరిగి దుకాణదారులకు ఇచ్చేశారు.



దుకాణాల్లో సిగరెట్ ప్యాకెట్లను తరలిస్తున్న టీటీడీ అధికారులు

సొంత జిల్లాలకు తహసీల్దార్లు

తిరుపతి జిల్లాకు రానున్న 42మంది

తిరుపతి(కలెక్టరేట్), జూలై 17: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జిల్లాలో పనిచేస్తున్న 42మంది తహసీల్దార్లను గుంటూరు, ప్రకాశం జిల్లాలతో పాటు రాయలసీమ జిల్లాలకు ప్రభుత్వం బదిలీ చేసింది. ఆయా జిల్లాల్లో పనిచేస్తుండిన తహసీల్దార్లను తిరుపతి జిల్లాకు పంపించింది.ఆయా జిల్లాల్లో పనిచేస్తున్న తహసీల్దార్లను తిరిగి పాత జిల్లాలకు బదిలీ చేసేందుకు సంబంధించి సీఎం చంద్రబాబు బుధవారం ఆమోదముద్ర వేశారు. జీవో రాగానే పలువురు తహసీల్దార్లు వారి పాత జిల్లాలకు వెళ్లనున్నారు.ఎన్నికల సమయంలో ఇక్కడినుంచి ఇతర జిల్లాలకు వెళ్లిన 42మంది తహసీల్దార్లు తిరిగి రానున్నారు.జిల్లాలోని పలు కీలకమైన మండలాలకు ఆర్డర్స్ వేయించుకునేందుకు తహసీల్దార్లు రాజకీయ నేతలను ఆశ్రయించినట్లు సమాచారం.

వైసీపీ పాలనలో లాక్కున్న భూములను తిరిగి రైతులకే అప్పగిస్తాం

\- మంత్రి రాంప్రసాద్‌రెడ్డి -



సోమల, జూలై 17: వైసీపీ పాలనలో లాక్కున్న భూములను తిరిగి రైతులకే అప్పగిస్తామని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు.చిత్తూరు జిల్లా సోమల మండలం కమ్మపల్లెలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోనే అత్యధికంగా పుంగనూరు నియోజకవర్గంలో భూ ఆక్రమణలు, రైతులపై దాడులు, టీడీపీ వారిపై అక్రమ కేసుల నమోదు జరిగాయన్నారు. దౌర్జన్యపూరితమైన పాలనకు భయపడి రైతులు మౌనంగా ఉండిపోయారన్నారు.భూములను తక్కువ ధరకు కొనుగోలు చేసి ఆ తర్వాత రెండింతల ధరకు ప్రభుత్వానికే వైసీపీ నేతలు విక్రయించారన్నారు.

తిరుపతి బస్టాండ్‌లో 16కిలోల గంజాయి స్వాధీనం

తిరుపతి(ఆర్టీసీ), జూలై 17: తిరుపతి సెంట్రల్ బస్సు స్టేషన్‌లో మంగళవారం అర్థరాత్రి 16 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. చెన్నై ప్లాట్‌ఫామ్ వద్ద ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పద స్థితిలో తిరుగుతుండగా ఆర్టీసీ బీట్ కానిస్టేబుల్స్ ఎన్డీ రెడ్డి, ఎంజీడీ బాబు, అవుట్‌పోస్ట్ ఏఎస్ఐ హేమలత, కానిస్టేబుల్ త్రినాథ్ గుర్తించారు. వారి బ్యాగులను సోదా చేశారు. 8ప్యాకెట్లలో 16కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకుని నిందితులను ఈస్ట్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిందితులు చెన్నైకి చెందిన అముల్‌రాజ్‌భరత్, రామలింగ బాలాజీలుగా గుర్తించారు. వీరిపై కేసు నమోదుచేశారు.



గంజాయితో పట్టుబడ్డ రామలింగం బాలాజి, అముల్‌రాజ్ భరత్

రక్తతర్పణం



తూగుండ్రం హైస్కూల్ మలుపువద్ద చాకులు, బ్లేడ్లతో కొట్టుకుంటూ రక్తం చిందిస్తున్న షియా ముస్లింలు

మొహర్రం సందర్భంగా బుధవారం జిల్లాలోని షియా ముస్లింలు పీర్లు ఊరేగించి, రక్తతర్పణం(అజాదారిమాతం) నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. మహమ్మద్ ప్రవక్త మనవడు ఇమామ్ హుస్సేన్, వారి కుటుంబీకులు, బంధువులు, అనుచరుల ప్రాణాలను అప్పటి పాలకుడు యజీద్ బలిగొన్నాడు. అలా ప్రాణాలు అర్పించిన వీరి కోసం శోకతప్త హృదయంతో రక్తతర్పణం చేపట్టారు. చిత్తూరు జిల్లా గంగాధరనెల్లూరు మండలం తూగుండ్రం పంచాయతీ ఆవలకొండలో మొహర్రం సందర్భంగా 10వరోజు అంజుమన్ అబ్బాషియా కమిటీ, అబ్బాషియా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మతగురువులు మౌలానా అబుదాలి, నబీల్ మీర్జా అధ్యక్షత వహించారు. మంగళవారం అర్థరాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు పలువురు నల్లదుస్తులు ధరించి అబ్బాషియా అసుఖానాలో ప్రార్థనలు చేశారు. ఆవలకొండ తూగుండ్రం హైస్కూల్ మలుపు, తూగుండ్రం ఫకీర్‌తోట వరకు ర్యాలీ నిర్వహించారు. పలువురు చిన్నారులు, యువకులు, పెద్దలు పదునైన చాకులు, బ్లేడ్లతో తమ ఛాతీ, వీపుపై కొట్టుకుంటూ రక్తతర్పణం నిర్వహించారు. రక్తం చిందిస్తున్న వారిపై నీళ్లు చల్లుతుండగా.. తారురోడ్డుసైతం ఎరుపెక్కింది. తూగుండ్రం ఫకీర్‌తోటవద్ద గల అగ్నిగుండం చుట్టు షియా ముస్లిమ్‌లు పీర్లతో ఊరేగింపుగా తిరిగారు. అక్కడా రక్తతర్పణం గావించి ప్రార్థనలు చేసి మొక్కులతో ముగించారు. ఈ సందర్భంగా చిత్తూరు తాలుకా సీఐ కుళ్లాయప్ప, ఎస్ఐలు రామాంజనేయులు, ఉమామహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఈ పీర్లు ఊరేగింపులో వివిధ ప్రాంతాల నుంచి షియా ముస్లింలు తరలివచ్చారు. అంజుమన్ అబ్బాసియా కమిటి చైర్మన్ ఎస్.హెచ్.నియాజ్‌అలీ, అబ్బాసియా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గులాంహుస్సేన్, వైస్ ప్రెసిడెంట్ ఇక్బాల్ హుస్సేన్, కార్యదర్శి రహమత్ అలీ, కోశాధికారి షాకీర్ అలీ, స్థానిక షియా ముస్లింలు పాల్గొన్నారు.

\- గంగాధరనెల్లూరు



శ్రీకాళహస్తీశ్వర ఆలయానికి ద్వార బంధనాలు



కోట, జూలై 17: మండల పరిధిలోని తిమ్మానాయుడు పాళెంలో జ్ఞానప్రసూ నాంబ సమేత సంత కాళహస్తీశ్వర స్వామి ఆలయానికి బుధవారం ద్వార బంధనాలను ఏర్పాటు చేశారు. ఆలయ పునఃనిర్మాణ పనుల్లో భాగంగా వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ చెన్నైకు చెందిన భక్తుల పర్యవేక్షణలో ద్వార బంధ నాలను ఏర్పాటు చేశారు. వందలాది మంది ముత్తైదువులు ఈ క్రతువులో పాల్గొన్నారు.

నేడు చిట్టమూరులో ఎమ్మెల్యే పర్యటన

చిట్టమూరు, జూలై 17 : గూడూరు ఎమ్మెల్యే సునీల్‌కుమార్ గురువారం చిట్టమూరు మండలంలో పర్యటిస్తున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ జి.కిషోర్‌నాయుడు తెలిపారు. ఉదయం ఈశ్వరవాక, అరవపాళెం, బయ్యవారికండ్రిగ, ఆలేటిపాడుల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయనున్నటు ఆయన తెలిపారు. మండలంలోని టీడీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

డ్రోన్‌తో పురుగుమందుల పిచికారీపై అవగాహన



చిల్లకూరు, జూలై 17: మండలంలోని బల్లవోలులో వ్యవసాయశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో రైతులకు డ్రోన్ సాయంతో పంటకు పురుగు మందుల పిచికారీపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. సాంకేతిక పరికరాలతో సాగు చేయడం ద్వారా ఖర్చులు తగ్గడంతోపాటు సమయం కూడా ఆదా అవుతుందన్నారు. డ్రోన్ ద్వారా పురుగుమందులు పిచికారీతో కూలీల కొరతను అధిగమించవచ్చన్నారు. అలాగే మందులను కూడా ఎకరాకు 10 శాతం వరకు ఆదా చేయవచ్చన్నారు.

రోటరీ క్లబ్ కార్యవర్గం

గూడూరు అర్బన్, జూలై 17: స్థానిక రోటరీ భవన్‌లో బుధవారం రోటరీ క్లబ్ కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా శ్రీధర్‌రెడ్డి, కార్యదర్శిగా గోపాల్‌నాయుడుని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ... రోటరీక్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తామన్నారు. బి.సురేంద్రరెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి, మునిగిరీష్, సతీష్, వాసు, దశరధరామిరెడ్డి, మయూరి శ్యాంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి



వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

గూడూరు అర్బన్, జూలై 17: ద్విచక్రవాహనదారులు వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని రూరల్ సీఐ వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. బుధవారం పోటుపాళెం జాతీయ రహదారి కూడలి వద్ద ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హెల్మెట్‌ను ధరించి వాహనాలు నడిపితే ప్రమాదం జరిగితే ప్రాణాపాయం నుంచి బయట పడవచ్చన్నారు.రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

బిర్యానీ పొట్లాల పంపిణీ



క్రాస్‌రోడ్డు సెంటరులో బిర్యానీ పొట్లాల పంపిణీలో టీడీపీ నాయకులు

వెంకటగిరి, జూలై 17: ఎమ్మెల్యే రామకృష్ణ పుట్టిన జన్మదిన వేడుకల్లో భాగంగా బుధవారం క్రాస్ రోడ్డు సెంటరులో ఆయన అభిమానులు, మిత్ర బృందం ఆధ్వర్యంలో బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భారీ కేక్‌ను ఎమ్మెల్యే రామకృష్ణ కట్ చేసి పంచిపెట్టారు. తనను మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించిన వెంకటగిరి ప్రజలకు జీవితాం రుణపడి ఉంటానన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం అనునిత్యం పాటుపడతానని చెప్పారు. అనంతరం కురుగొండ్ల అభిమానులు కాపా శ్రీనివాసులు నాయుడు, రంగినేని శాంతారావు, చిట్టేటి ఉయకుమార్, మాబూ, బాషా, మల్లారం బాబు తదితరులు సమకూర్చిన బిర్యానీ ప్యాకెట్లను పంచిపెట్టారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



నోటు పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

డక్కిలి, జూలై 17: ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకొని మండలంలోని కంథలవారిపల్లి ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. తన పుట్టిన రోజున బొకేలు, శాలువాలు తీసుకు రావద్దని ఎమ్మెల్యే కురుగొండ్ల చెప్పిన విషయం విదితమే. ఈక్రమంలో ఆయన పుట్టిన రోజున విద్యార్థులకు అవసరమైన విద్యాసామగ్రిని అందించినట్టు నాయకులు చెప్పారు. ఏపీ ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ జి.మునెయ్య, ఎమ్మార్పీఎస్ నాయకుడు మంగళంపురి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మొహర్రం

కోట/ ఓజిలి, జూలై 17: కోట మండల పరిధిలోని కేశవరంలో మూడు రోజులపాటు జరిగిన మొహర్రం కార్యక్రమాలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా గ్రామస్తులు పీర్లను గుమటంలో ఉంచి కేశవరంలో మేళతాళాల మధ్య ఊరేగించారు. పీర్లను ఎత్తుకునేందుకు గ్రామస్తులు పోటీపడ్డారు. గుమటం, పీర్లను తిరిగి చావడిలో చేర్చారు. ఓజిలి మండలంలో ముస్లింలు బుధవారం మొహర్రం (పీర్లపండుగ)ను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్జిమేడు, ఆరిమేనిపాడు, రాచపాళెం, అత్తివరం, సగుటూరువడ్డిపాళెంలలో ముస్లిం మత పెద్దలు బోధనలు చేశారు.



ఊరేగింపునకు సిద్ధంగా ఉన్న గుమటం

కదలకుండానే కాసులు... మూలనపడ్డ క్లాప్ ఆటోలు

సూళ్లూరుపేట, జూలై 17: వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇంటింటా చెత్త సేకరణ పేరుతో రాష్ట్ర స్థాయిలో ఓ సంస్థకు కాంట్రాక్టు అప్పగించింది. ఇందులో భగంగా సూళ్లూరుపేట మున్సిపాలిటీకి ఏడాది ముందు 8 బ్యాటరీ ఆటోలను అందజేశారు. మొత్తం 25 వార్డులకు గాను ఒక ఆటో 3 వార్డులకు చొప్పున 8 ఆటోలను అంద జేసి ఆయా వార్డుల్లో సందుసందుకెళ్లి తడి, పొడి చెత్తను సేకరించి ఆటోల ద్వారా తరలించారు. వీటి నిర్వహణకు సదరు ఏజెన్సీకి నెలకు రూ.15 వేల నుంచి రూ.20 వేలు వరకు మున్సిపాలిటీ చెల్లిస్తోంది. ఇంత చెల్లిస్తున్నా వాటి నిర్వహణ తీరు చాలా ఘోరంగానే ఉంది. ఓ నాలుగు రోజులు ఆటోల్లో చెత్త సేకరించారు. ప్రస్తుతం ఆ ఏజెన్సీకి చెందిన ఒక ఆటో కూడా చెత్త సేకరణకు తిరగడం లేదు. ఏడాదిగా ఆఆటోలు మున్సిపల్ కార్యాలయ షెడ్‌లో మూలన చేరాయి. బ్యాటరీలు పనిచేయడం లేదని పలుసార్లు సదరు ఏజెన్సీకి అధికారులు సమాచారం ఇచ్చినా నేటికి వాటి బాగోగులు చూడలేదు. క్లాప్ ఆటోలు మూలనపడడంతో మున్సిపాలిటీలో ట్రాక్టర్ల ద్వారానే చెత్తను సేకరించి తరలిస్తున్నారు. అప్పటి ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఆటోల కొనుగోలు పేరుతో సదరు ఏజెన్సీకి చెల్లించినా ఆ వాహనాలు ఎందుకూ పనికిరాకుండా దర్శనమిస్తున్నాయి.



మున్సిపాలిటీ షెడ్‌లో ఉన్న క్లాప్ ఆటోలు



ట్రాక్టర్ల ద్వారానే చెత్తను సేకరిస్తున్న కార్మికులు

ఘనంగా తొలి ఏకాదశి పూజలు







సూళ్లూరుపేటలో స్వామివారి ఊరేగింపు - నాయుడుపేట పట్టణంలోని పాతబ్రాహ్మణవీధిలో ఉన్న కల్యాణ వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక అలంకరణ - శ్రీలక్ష్మమ్మకాలనీలో ఉన్న వేంకటేశ్వరాలయంలో స్వామివారికి ప్రత్యేక పుష్పాలంకరణ

గూడూరు అర్బన్/ చిల్లకూరు/ సూళ్లూరుపేట/ నాయుడుపేట/ కోట, జూలై 17: తొలి ఏకాదశి పండుగ సందర్భంగా బుధవారం గూడూరు పట్టణంలోని పలు వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు ప్రసన్న వేంకటేశ్వరస్వామి, బాలాజీనగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో స్వామివారిని దర్శించుకున్నారు. చిల్లకూరు మండలంలోని కలవకొండలో లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, ప్రత్యేకపూజలు జరిగాయి. రాత్రికి స్వామివారికి ఏకాంతసేవ నిర్వహించారు. సూళ్లూరుపేట పట్టణంలోని మద్వేంకటరామమూర్తి స్వామి ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. షార్ బస్టాండు సమీపంలో ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం, బాపూజీ వీధిలోని పాండురంగస్వామి ఆలయాల్లో స్వామివార్లను అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పట్టణంలో ఊరేగిస్తూ భజనలు చేశారు. నాయుడుపేట పట్టణంలోని పాతబ్రాహ్మణవీధిలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం, స్వర్ణముఖినది పరీవాహక ప్రాంతంలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానం, తుమ్మూరు కరిమాణిక్యస్వామి దేవస్థానాల్లో శ్రీవారిని, అమ్మవార్లను ప్రత్యేకంగా పుష్పాలంకరణ గావించారు. విష్ణు సహస్రనామాలు, మూలమంత్రం, లక్ష తులసి పూజలు నిర్వహించారు. కోట మండలంలోని పలు వైష్ణవ ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు ఘనంగా జరిగాయి. మహావిష్ణువు యోగ నిద్రలోకి వెళ్లే ఘట్టాన్ని పురస్కరించుకొని పలు వేంకటేశ్వర ఆలయాలు ముస్తాబయ్యాయి. నెల్లూరుపల్లి కొత్తపాళెం, గోవిందపల్లి, చిట్టేడు, లక్ష్మమ్మ కాలనీల్లో భక్తులు ఏకాదశి పూజలు నిర్వహించారు.

సర్వీస్ రోడ్లు మంజూరు చేయండి

● కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి వినతి



గడ్కరీకి వినతిపత్రం అందిస్తున్న నరేంద్రరెడ్డి తదితరులు

పెళ్లకూరు, జూలై 17 : మండలంలోని చిల్లకూరు నుంచి దిగువ చావాలి వరకు ఉన్న అండర్ పాస్‌లను కలిపే విధంగా 71వ జాతీయ రహదారికి ఇరువైపులా రెండు లేన్ల సర్వీస్ రోడ్లు మంజూరు చేయాలని రోడ్లు, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.నరేంద్ర రెడ్డి వినతిపత్రం అందజేశారు. బుధవారం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎస్.మునిసుబ్రహ్మణ్యం, ఎస్.దయాకర్‌రెడ్డితో కలసి పాలచ్చూరుకు నరేంద్రరెడ్డి కలసి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా 71 జాతీయ రహదారికి ఇరువైపుల సర్వీస్ రోడ్లు లేకపోవడంతో పాలచ్చూరు, కప్పగుంటకండ్రిగ, దిరసనమాల, జంగాలపల్లి, పెరుమాళ్లపల్లి, అనకవోలు తదితర 10 గ్రామాలకు చెందిన 10వేల మందికి పైగా జనాభాతో పాటు మేనకూరు సెజ్‌లకు వెళ్లే వందలాది మంది కార్మికులు, రహదారికి ఇరువైపుల పంటలను సాగు చేస్తున్న రైతులు పడే అవస్థలను కేంద్రమంత్రి గడ్కరీకి విన్నవించారు. ముఖ్యంగా ఈ ప్రాంత ప్రజలు అనారోగ్యానికి గురైతే కనీసం 108 వాహనం వచ్చే అవకాశం లేదన్నారు. దీంతో స్పందించిన కేంద్రమంత్రి నిధులు మంజూరుకు హామీ ఇచ్చినట్లు నరేంద్రరెడ్డి తెలిపారు.

వైభవంగా పాండురంగడి రథోత్సవం



గూడూరు, జూలై 17: స్థానిక గమళ్లపాళెంలోని పాండురంగస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. తొలి ఏకాదశి కావడంతో భక్తులు అధికసంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం స్వామివారిని రథంపై ఉంచి మంగళ వాయిద్యాలు, కోలాటాల నడుమ రథాన్ని లాగి మొక్కులు తీర్చుకున్నారు.

ఆగస్టు 25 నుంచి టీచర్స్ క్రికెట్ లీగ్ పోటీలు

గూడూరు, జూలై 17: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 25 నుంచి 28వ తేదీ వరకు ఏ.ఏ.రెడ్డి ప్రభుత్వ స్టేడియంలో టీచర్స్ క్రికెట్ లీగ్ పోటీలను నిర్వహించనున్నట్లు ప్రగతి సేవా సంస్థ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ చెప్పారు. నెల్లూరు, తిరుపతి జిల్లాలకు సంబంధించి 18 మండలాల జట్లు పోటీల్లో పాల్గొంటాయన్నారు.

ఆత్మగౌరవ పోరాటాలు చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

కోట, జూలై 17: హక్కులకోసం బహుజనులు ఆత్మగౌరవ పోరాటాలు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణరాజు, బహుజన ఐక్యవేదిక నాయకుడు బి.విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. కోట పట్టణంలోని షాదీమంజిల్‌లో బుధవారం బహుజనుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కారంచేడు స్ఫూర్తి సభ జరిగింది. ముందుగా బహుజన ఐక్యవేదిక నాయకులు అంబేడ్కర్, కాన్షీరాం, పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... రాజ్యాధికారం కోసం అందరూ కలసికట్టుగా ముందుకు సాగాలన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆశయ సాధన కోసం 85 శాతం జనాభా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు తమ ఆలోచనలకు పదును పెట్టాలన్నారు. కారంచేడు, చుండూరు ఘటనలపై అప్పట్లో ప్రచారం జరగలేదన్నారు. బహుజనులంతా ఏకమై రాజ్యాధికారం వైపు అడుగులు వేయాలన్నారు. దాసరి సుందరం, ఎం.మాధవ్, రంగనాథ్, అశోక్, యునైటెడ్ ఫోరం మహిళా అధ్యక్షురాలు డి.పద్మజ, వి.దినకర్ బాబు, రామకృష్ణ, ఎ.పార్వతయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శూల గ్రామోత్సవం



నాయుడు పేట టౌన్, జూలై 17 : పట్టణంలోని లోతువానిగుంటలో కొలువై ఉన్న గ్రామ దేవత పోలేరమ్మ ఆలయంలో పొం గళ్ల మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి పాలాభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు అమ్మవారికి అంబళ్లు పోశారు. రాత్రి మంగళవాయిద్యాల నడుమ శూల గ్రామోత్సవం నిర్వహించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.15 కోట్లు

తిరుమల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.15 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం లెక్కించి బుధవారం ఉదయం ప్రకటించింది. మంగళవారం 71,409 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 26,128 మంది తలనీలాలు సమర్పించారు.

ఘనంగా కురుగొండ్ల పుట్టిన రోజు వేడుకలు





క్రాస్‌రోడ్డులో కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ - కస్తూర్బా గాంధీ పాఠశాలలో మొక్క నాటుతున్న కురుగొండ్ల

వెంకటగిరి, జూలై 17: వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ జన్మదిన వేడుకలు బుధవారం ఆయన నివాసంలో ఘనంగా జరిగాయి. ఉదయం నుంచే నేతలు పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యే నివాసానికి చేరుకున్నారు. ఇంటో పూజల అనంతరం నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి పోలేరమ్మను దర్శించుకున్నారు. అక్కడి నుంచి పట్టణంలోని కస్తూర్బా విద్యాలయానికి చేరుకున్న రామకృష్ణ నేతలు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్‌చేసి విద్యార్థుల మధ్య తన పుట్టిన రోజు వేడుకలను జరుపుకున్నారు. అలాగే మొక్కను నాటారు. అనంతరం తన నివాసానికి చేరుకున్న ఆయన భైరవరం దాసరి బ్రదర్స్ ఏర్పాటు చేసిన 60 కిలోల కేక్‌ను కట్‌చేశారు. నాయకులు, అభిమానులు ఈ సందర్భంగా రామకృష్ణను గజమాలతో సత్కరించారు. ఈ సారి ఎమ్మెల్యే పుట్టిన రోజు వేడుకలకు హజరైన వారు విద్యాసామగ్రి తీసుకువచ్చారు. ఎమ్మెల్యేకి శుభాకాంక్షలు తెలిపిన ముఖ్య నాయకుల్లో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి బీద రవిచంద్ర, గంగోటి నాగేశ్వరరావు, హజరత్త నాయుడు, జె.రమణయ్య, వెంకటగిరి వ్యవసాయ మార్కెటింగ్ మాజీ చైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, బీరం రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, కాపా శ్రీనివాసులు నాయుడు, మల్లారం బాబు, జీకేపల్లి బాబు నాయుడు, పప్పు చంద్రమౌళిరెడ్డి, అవ్వారు సత్యం, జానపాటి బాలకృష్ణ, రంగినేని రాజా, గడ్డం చంద్రశేఖరరెడ్డి, పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, పోలంరెడ్డి వెంకటరెడ్డి, పులి జానార్దనరెడ్డి, మునికృష్ణయ్య, మాధవరెడ్డి, శ్రీరామదాస్ గంగాధర్, పునుగోటి విశ్వనాథనాయుడు, గొల్లగుంట మురళీకృష్ణ, సామల లక్ష్మీపతి, జానపాటి మురళి, డివిఆర్, పులికొల్లు శివకుమార్ నాయుడు, నాగరాజు, తాండవ చంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

బాలాయపల్లి: ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ జన్మదిన వేడుకలను బాలాయపల్లి టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు రాయి మస్తాన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు. గొట్టికాడులో ప్రతాప్ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. ఎస్.భాస్కర్ రావు, కె.శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలసిన పనబాక భూలక్ష్మి



నాయుడుపేట, జూలై 17: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేశ్‌ను విజయవాడలో నాయుడుపేటకు చెందిన నెల్లూరు పార్లమెంట్ తెలుగు మహిళ అధ్యక్షురాలు పనబాక భూలక్ష్మి బుధవారం మర్యాదపూర్వకంగా కలసినట్లు తెలిపారు. జిల్లాలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. ఆమె వెంట టీడీపీ నాయకులు గంగరాజు, గంగబాబు, గంగాధరయ్య, హరి ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం



వాకాడు, జూలై 17: నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బాలిరెడ్డిపాళెం స్వర్ణముఖినదిలో సెబ్ సిబ్బంది బుధవారం అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సెబ్ సీఐ శ్రీనివాసులు మాట్లాడుతూ... చిట్టమూరు మండలం కొక్కుపాళెంకు చెందిన ఇ.యశ్వంత్, చిల్లకూరు మండలం చింతవరానికి చెందిన సూలయ్య బాలిరెడ్డిపాళెం స్వర్ణముఖి నదిలో మంగళవారం అర్ధరాత్రి 12 గంటలకు ఇసుకను తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. వీరిపై కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో సెబ్ ఎస్ఐ జయరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ ఎక్కి మతిస్థిమితం లేని వ్యక్తి హల్‌చల్



వాకాడు, జూలై 17: మండలంలోని దుగరాజపట్నంలోని వాటర్ ట్యాంక్ ఎక్కి మతిస్థిమితం లేని వ్యక్తి హల్‌చల్ చేయడంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందజేశారు. కానిస్టేబుల్ సురేష్ సంఘటనా స్థలికి చేరుకుని చాకచక్యంగా మతిస్థిమితం లేని వ్యక్తిని కిందకు తీసుకువచ్చి కుటుంబసభ్యులకు అప్పగించారు.

యువతిపై లైంగిక దాడి

గూడూరు, జూలై 17: తనపై ఓ యువకుడు లైంగిక దాడికి పాల్పడినట్లు ఒక విద్యార్థిని బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇంటర్మీడియట్ చదువుతున్న ఆ యువతి కళాశాలకు వెళ్లి వస్తుండగా అశోక్‌నగర్‌కు చెందిన వినయ్‌కుమార్ బలవంతంగా ఆటోలో ఎక్కించుకున్నాడు. గాంధీనగర్ ప్రాంతానికి తీసుకువెళ్లి ఓ ఇంట్లో లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీంతో మనస్తాపానికి గురైన ఆ యువతి బుధవారం ఇంట్లో ఫినాయిల్ తాగి అస్వస్థతకు లోనైంది. చికిత్సనిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా జరిగిన సంఘటన వెలుగులోకి వచ్చింది. డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి బాధితురాలి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు వెల్లడించారు.

పట్టపగలే మన్నారుపోలూరులో చోరీ



బాధితుల వద్ద వివరాలు సేకరిస్తున్న పోలీసులు

సూళ్లూరు పేట, జూలై 17: మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరులో బుధవారం పట్టపగలు... అదీ నిత్యం జనసంచారం ఉండే ప్రాంతంలో ఓ ఇంట్లో చోరీ జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... మన్నారుపోలూరులోని గొల్లవీధిలో కాపురం ఉంటున్న పి.గోపి, శాంతి నివాసంలో మిట్ట మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి బంగారు ఆభరణాల సహా రూ.10 వేలను అపహరించారు. దంపతులిద్దరూ మన్నారుపోలూరులోనే ఉన్న ఓ వాటర్ ప్లాంట్‌లో రోజువారీ కూలీలు. ఈ క్రమంలో బుధవారం ఇంటికి తాళం వేసుకుని పనికి వెళ్లారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో పక్కనున్న వారు ఇంటి తలుపులు తీసివేసి ఉండడంతో వెంటనే వారికి సమాచారం అందించారు. బాధితులు ఇంటికి చేరుకుని పరిశీలించారు. ఇంటికి వేసిన తాళం పగలగొట్టి బీరువాను ధ్వంసం చేసి 5 సవర్ల బంగారు నగలు, రూ.10 వేలు చోరీ చేసినట్టు గుర్తించారు. ఈ మేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీహరికోట ఎస్ఐ రఘునాథ్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను వివరాలడిగి తెలుసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలిపేందుకు కృషి చేస్తా



ఎమ్మెల్యేకు తమ సమస్యలను వివరిస్తున్న పోలీసులు

గూడూరు, జూలై 17: గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలిపేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన పలువురు పోలీస్ సిబ్బంది ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నెల్లూరులో ఉంటూ గూడూరులో ఉద్యోగం చేస్తున్న పోలీస్ సిబ్బంది ఉద్యోగ రీత్యా తిరుపతి జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే ఇబ్బంది పడాల్సి వస్తోందని తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. నెల్లూరు దగ్గరగా ఉండడంతో గూడూరు నియోజకవర్గాన్ని తిరిగి ఆ జిల్లాలో కలిపేలా సహకరించాలని పోలీసులు కోరారన్నారు. త్వరలో జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో ఈ విషయాన్ని ప్రస్తావించి గూడూరు నియోజకవర్గాన్ని తిరిగి నెల్లూరు జిల్లా పరిధిలోకి తీసుకు వచ్చేందుకు కృషి చేస్తానన్నారు.